
# అధికప్రసంగం

(హాస్యగల్పికలు)

\- ఎమ్వీయల్







శ్రీ
కౌముది
మీ ముంగిట్లో సాహితీ వెన్నెల
www.koumudi.net

కౌముది ప్రచురణలు - 111



*నూజివీడు కాలేజీలో ఇరవయ్యేళ్ళ పాటు తెలుగు శాఖలో అధ్యాపకుడిగా, శాఖాధిపతిగా పనిచేసిన శ్రీ ఎమ్వీ.ఎల్ గారు చక్కటి హాస్యరచయితగానే కాక 'ముత్యాలముగ్గు' లాంటి సినీ నిర్మాతగా కూడ తెలుగు సాహితీ ప్రియులకి చిరపరిచితులు. ఆయన 1984 లో స్వాతి వారపత్రిక ప్రారంభించినప్పుడు అందులో వ్రాసిన వీక్లీ కాలమ్ ఇది. కౌముది పాఠకులకోసం ప్రత్యేక అనుమతితో పునర్ముద్రిస్తున్నాం. ఈ వ్యాసాలని ఎంతో శ్రమకోర్చి అందమైన అక్షరాల్లో తిరగరాసి 'కౌముది' కి పంపించిన ఎమ్వీ.ఎల్గారి సతీమణి శ్రీమతి వరలక్ష్మిగారికి, వారి కుమార్తె శ్రీమతి అనూరాధగారికీ 'కౌముది' కృతజ్ఞతలు తెలియచేస్తోంది.*

## 1

ఏదీ... మీ పిన్నిలా నిద్దరోవటం కాదు. 'పెనునిద్దర వదిలించేదీ మునుముందుకు నడిపించేదీ' ఏదైతే ఉందో అదీ మన తక్షణ కర్తవ్యం. మితభాషిని కాబట్టి ఒక్కముక్కలో చెప్పాను. దాని అర్థం తాత్పర్యం నువ్వే ఆలోచించుకో -

భారతంలో దుశ్శాసనుడి పాత్రనంతా 'మాయాబజారు' సినిమాలో ఒక్కముక్కలో కుదించి పెట్టేశాడు పింగళిగారు.

భారతాన్ని జీర్ణం చేసుకున్నవాడు కాని అలా అనలేడు.

మీ పిన్నికి నిద్దరోవటం తక్షణ కర్తవ్యం.

ఆడాళ్ళకి అస్సలు నిద్రపట్టని సందర్భాలు, భేషుగ్గా నిద్రపట్టే సమయాలు, నిద్రనటించే క్షణాలు ఇట్టే కనిపెట్టెయ్యొచ్చు.

పక్కింటి పిన్నిగారు పట్టుచీర కొన్నదనుకో, పోనీ, కొందామనుకుంటానని అన్నదనుకో - స్టీలు మరచెంబో, కొత్తావకాయ జాడీయో కొని తెచ్చి చూచిందనుకో - ఇంక ఇవతలింట్లో శివరాత్రి జాగరణే!

కట్టుకున్న మొగాడికి జాతరే!

సంపూర్ణ తీర్థయాత్రలు చేయించే బస్సు టికెట్టు కొన్నదనుకో - ఆవిడ బొందితో కైలాసానికి పోతోందన్నంత బాధ! రేట్లు పెరిగింతర్వాత కూడా అయిదు హాళ్ళలో సినిమాలు ఆనవాయితీ తప్పకుండా చూసేస్తోందనుకో... ఇహ చెప్పనక్కరలేదు.

పక్కింటావిడ మెడలో గొలుసు సినిమాహాల్లో పోయినా, తీర్థయాత్రల్లో డబ్బు పారేసుకున్నా, కొత్తావకాయజాడీ కొట్లోంచి ఇంట్లో కొచ్చేలోగా పగిలిపోయినా, స్టీలు మరచెంబు మనసు మార్చుకుని స్టెయిన్ లెస్ కాదని చింతపండు మొహం పెట్టినా, పట్టుచీర పట్టుమని ఒక్కసారన్నా కట్టకుండా పెట్టెలోనే చిమ్మెటుట్లు కొట్టేసినా ఈవిడకి ఆ రోజు సుఖనిద్ర! సౌండ్ స్లీప్ - విత్ గురక!

మనం అర్జెంటుగా బజారెళ్ళాల్సొచ్చి విరిగిపోయిన గుండీల్ని పరామర్శించుకుంటున్నప్పుడు, కళ్ళజోడు నెత్తిమీద పెట్టుకుని కనబడలేదని ఇంట్లోనూ, బాత్రూంలోనూ వెతుక్కుంటున్నప్పుడు, చల్లారిపోయిన కాఫీని ఊదుకు తాగుతున్నప్పుడు, పర్సులో పెట్టుకున్న పదిరూపాయలూ భద్రంగా అంతర్ధానమై విసుక్కుంటున్నప్పుడు - ఆడాళ్ళకి నిద్ర నటించే క్షణాలు.

కాఫీ టిఫిన్ల వేళకు స్నేహితులు, బోయినాల వేళకు నీ తరపు బంధువులూ దిగబడ్డారనుకో - ఆవిణ్ణి లేపటం కన్నా కుంభకర్ణుడి కోసం ట్రై చెయ్యటం తేలిక!

కనక, ఈ  మూడు సమయములూ గుర్తుంచుకు ప్రవర్తించావనుకో, - ఇంటిగుట్టు రచ్చకెక్కకుండా జాగ్రత్త పడినవాడివవుతావు. అదే మన తక్షణ కర్తవ్యం.

కాదుకూడదని మగతనం ప్రదర్శిస్తే తమలపాకుతో మనమిట్లంటే, తలుపు చెక్కతో తానట్లనును.

మాయాబజారు సినిమా అంటే నాకు మా చెడ్డ ఇష్టం. మొన్న శకుని మావ గుర్తొస్తే ఇవాళ సోదర దుశ్శాసనుడు గుర్తొస్తున్నాడు.

భారతంలో మహావీరుడైన లక్ష్మణ కుమారుణ్ణి ఉత్త ఉత్తరకుమారుణ్ణి చేసి కామెడి చేశాడనీ, కౌరవులందర్నీ వెర్రివెధవలుగా చూపించాడనీ అరగొరగా ఆ కథలు తెలిసిన నీలాంటి కుర్రకారు అనొచ్చు - పురాణ కథలు తీసుకుని నాటకీయతకోసం మార్పులు చేసే సొతంత్రం కవులకుంటుందనటానికి సాక్షాత్తూ కాళిదాసే సాక్షి.

ఒక్కసారి సినిమా గుర్తుతెచ్చుకో .. పాండవులన్న పెద్దమనుషుల్ని చూపించకుండా కథ నడిపించేశాడు. చివరికి ద్రౌపదీ మానసంరక్షణ ఘట్టంలో కూడా వాళ్ళని అవుట్ ఫోకస్ చేసేశాడు. అందుకే అన్నారు కె.వి.రెడ్డి ప్లస్ పింగళి ఈజీక్వల్టు షేక్స్పియరని!

'తోడికోడళ్ళు' సినిమా చూశావా?

రేలంగి పేరు తల్చుకుంటేనే నవ్వొస్తుంది.

భార్య సూర్యకాంతం గయ్యాళి.. అయినా భర్తంటే ప్రేమే సుమా.

చక్కటి పిలకముడి జుట్టుతో, నీర్కావి బట్టల్తో పల్లెటూరి రైతులా ఉండే రేలంగిని నాగరీకంగా మార్చి అతన్ని తన గుప్పెట్లో పెట్టుకుని నాటకమాడాలనుకుంటాడు జగ్గయ్య. మొదటి మెట్టుగా కేశఖండనం చేయిస్తాడు. చక్కటి ముడిగల జుట్టు చేతికొచ్చేసరికి కళ్ళమ్మట నీళ్ళొస్తాయి మనవాడికి. అయినా అందమైన క్రాఫింగ్ చూసుకుని ఆనందపడతాడు. బారిష్టరు పార్వతీశంలా కొత్తసూటులో మురిసిపోతాడు. కానీ, గుమ్మంలో సూర్యకాంతం కనబడగానే జావగారిపోతాడు.

'ఒక్క క్షణం అక్కడే ఆగండ'ని సూర్యకాంతం లోపలికెళ్ళి చీపురు కట్ట తీసుకొస్తుంది. నాలుగ్గోడల మధ్యా చీపురుకట్ట సరసం బాగానే ఉంటుంది కానీ, బజార్న పడితే పరువుదక్కదు. సూర్యకాంతం ఎడం చేతి వాటంతో చీపురుకట్టతో దిష్టితీస్తుంది.

రేలంగి గుండెలు అప్పటికి కుదుటపడతాయి.

జగ్గయ్య కేసి చూసి వెర్రి నవ్వొటి నవ్వి "ఓ! ఇందుకా? అందుకనుకున్నాను." అంటాడు ముక్తసరిగా - ఆ ఒక్కముక్కలో ఎంత అంతరార్థం. ఎంతో ఫ్లాష్ బ్యాక్ కథ చూపించకుండానే ప్రేక్షకులకి అర్థమైపోయి హాస్యసృష్టి జరుగుతుంది.

నేనూ మితభాషిని గనక అలాంటి డైలాగులు విన్నా, అవి రాసిపోసిన ఆత్రేయలాంటి రచయితల్ని తల్చుకున్నా తన్మయత్వం కలుగుతుంది. సందర్భం వచ్చింది కాబట్టి చెబుతున్నాను. 'పెద్దమనుషులు' సినిమా చూశావా? డి.వి.నరసరాజుగారు రాశారు. అప్పటికి నువ్వు పెద్దమనిషివయ్యుండవులే. తను చెయ్యని హత్యానేరాన్ని నెత్తిమీదేసుకుని స్వామి భక్తి కొద్దీ జైలు శిక్ష అనుభవించి తిరిగొస్తాడు లింగమూర్తి. తన కుటుంబాన్ని పోషించటం పోయి ఆ పెద్ద మనిషే నాశనం చేశాడని తెలుసుకుంటాడు. ఓ పేపరు పెట్టి పెద్ద మనుషుల్ని ఏకి పారేస్తుంటాడు. అర్ధరాత్రివేళ ఆ పెద్దమనిషి వచ్చి లింగమూర్తికి పేపరాపెయ్యమని వార్నింగిస్తాడు. ఆ సంభాషణలో, లింగమూర్తి బాగ్యకి పెదమనిషి అసలు రంగు తెలుసుంది. హత్య చేసింది తన భరకాదనీ, ఆ పెదమనిషేననీ అరమెపోతుంది. ఆయన వెళ్ళాక భర

దగ్గిరకొచ్చి 'ఏవిటండీ ఇది?' అనడుగుతుంది. అప్పటివరకు పెదవి విప్పి పెళ్ళాం దగ్గర కూడా ఆ రహస్యం చెప్పని లింగమూర్తి చాలా నిర్లిప్తంగా

"ప్రపంచం!" అంటాడు. అదీ డైలాగంటే! ఆ మాటకెంత పొడుగూ, వెడల్పూ, లోతూ ఉన్నాయో ఆలోచించు ఇప్పుడూ రాస్తున్నారు కొండవీటి చాంతాళ్ళంత సంభాషణలు. వాటివల్ల కథ కదలకపోగా అందులో అక్షరమ్ముక్క అర్థంకాదు.

అందుకే ఇప్పుడొస్తున్న సినిమాల గురించి నేనసలు మాటాణ్ణు.

ఒకటీ అరా మంచివే వస్తున్నాయట. కానీ సినిమా టికెట్ల రేట్లు? వాటికన్నా మా ఆవిణ్ణి బతిమాలుకుని, కాస్త కష్టమైనా పెరుగావడలు చేయించుకు తింటం బెస్ట్.

అన్నట్టు ఇవాళ ఫస్ట్ తారీక్కదూ!

నీకు జీతాలొచ్చేరోజు.

మరి అలాగ రుబ్బురోల్లా కూచుండిపోతావేవిటోయ్.


అలా హోటల్దాకా నడిచివెళితే కాస్త కాలు సాగినట్టూ ఉంటుంది. ఎన్నాళ్ళయిందో తిని...... పెరుగావడల్లో కారబ్బూంది చల్లుకుతింటే ఉంటుంది మహాప్రభో!

**అదే మన తక్షణ కర్తవ్యం.**



# అధికప్రసంగం

– ఎమ్వీ.ఎల్



2

**ఎండన పడొచ్చావేవిటోయ్! సందేళ రాకపోయావా?**

ఓహో ఇవాళ ఆదివారం కదూ!

రిటైరయ్యాక నాకు అన్నివారాలూ ఒకలాగే కనబడుతున్నాయి.

శరత్‌బాబుని తెలుగువాళ్ళకి తొలిసారి పరిచయం చేసిన మహానుభావుడు విజయాధినేత చక్రపాణిగారిదో జోక్ చెబుతారు.

'ఇవాళ షూటింగుంది రమ్మ'ని ఓ హీరోకి కబురెట్టాట్ట.

'వారు ఆదివారాలు పన్జెయ్యరటసార్' అని చెప్పాడు తిరిగొచ్చిన ప్రొడక్షను మేనేజరు. పెద్ద పెద్ద హీరోలంతా ఆయన చేతులమీదుగా పెద్దవాళ్ళయ్యారు కదా! ఆ మాట విన్న ఆయనకి కోపమొచ్చిందట. అయినా తమాయించుకుని 'ఈ మద్దెన ఆ హీరోగారి సినిమాలు రెండు రిలీజయ్యాయి గదా! ఎలా ఉన్నాయట?' అనడిగారు.

'అట్టర్ ఫ్లాపండీ' అన్నాట్ట ప్రొడక్షను మేనేజరు.

'అట్టాగా! అయితే ఆ హీరోకి ఇహనన్నీ ఆదివారాలే అన్జెప్పు.'

***అల్లాగే మనకన్నీ ఆదివారాలే!***

పోన్లే మంచి పన్జేశావ్. మీ పిన్ని అదేదో 'అమ్మవారి మహిమో', 'క్షేత్రమాత్యవో' – మధ్యాహ్నం ఆటకెళ్ళింది. వొచ్చేసరికి రొండో రొండున్నరో అవుతుంది. అసలీ మధ్యాహ్నం ఆటలన్నవి ఈ మధ్యనొచ్చాయి. పూర్వం 'మాట్నీ ఆటతో నేడే బ్రహ్మాండమైన విడుదల' అంటే అదే గొప్ప.

తరువాత్తరవాత ఉదయం ఆటతో బ్రహ్మాండమైన విడుదలలు మొదలయ్యాయి. సినిమా వాళ్ళు 'ఎనిమిది గంటల అయిదు నిమిషాలకి ఉదయం ఆటతో మొదలు' అని ముహూర్తం పెడితే, మనవాళ్ళు పెళ్ళికి తయారయినట్టు ఆరింటికే వెళ్ళి 'క్యూ'ల్లో నిలబడుతున్నారు. రోజులలా మారిపోయాయి.

నాగేశ్వరావు నటించిన 'రోజులు మారాయి' సినిమాలప్పుడు రోజులిలా లేవు.

'ఏరువాకా సాగారోరన్నో చిన్నన్నా' అని డప్పేసి డాన్సు చేస్తూ పబ్లిసిటీ చేస్తే జనం బ్రహ్మరథం పట్టేశారు. దాంతోపాటు కథ కూడా గట్టిపట్టు పట్టేసిందనుకో!

కొన్నాళ్ళ పాటు ఆదివారం మాత్రమే ఉదయం ఆటలు వేసేవాళ్ళు. ఇప్పుడు నాలాంటి రిటైరైన వాళ్ళకోసవన్నట్లు రోజా పొద్దునోటి, మధ్యాహ్నవోటి లాగించేస్తున్నారు, అసలు సినిమా – మూడాటలూ కాక.

ఇహ జూస్కో.. పదింటికే వంటా వడ్డనా ముగించేసి ఆడాళ్ళు ఆ సినిమాలకి ఎగబడిపోతున్నారు.

***అదేవిటన్నావనుకో, –***

పిల్లలా.. స్కూలు కెళ్తారు. ఆయనకా.. ఆఫీసు! ఇంట్లో ఒక్కదానికీ బోరు కొట్టేస్తోంది పిన్నీ. ఏదో కాలక్షేపం అంటున్నారు.

అదీ నిజవేననుకో, –

కానీ పాతకాలంలో పగటి బోయనాలయ్యాక వెంటనే రాత్రి వంట గురించే ఆలోచిస్తూ పనులు చేసుకునేవాళ్ళు. బియ్యంలో రాళ్ళేరటం, లేకపోతే రాళ్ళలో బియ్యవేరటం, ఉప్పూ, పప్పూ బాగుచేసుకోటం, బళ్ళోంచొచ్చే పిల్లలకీ, ఒళ్ళు పులిసేలా పన్జేసొచ్చే ఇంటాయనకీ రోజుకోరకం టిఫిన్ చేసిపెట్టటం.. వగైరా పనులు ఇప్పుడు పతివ్రతల కథల్లో రాసుకునేవయిపోయాయి.

మిక్సీలు, గాస్టౌలు వచ్చాక నడుమొంచి పన్జేసే అలవాటే తప్పిపోయింది. ఇల్లూడ్చేటప్పుడు కూడా నడుం వంచటం లేదనుకో! రకరకాల కాళ్ళనొప్పులూ, కీళ్ళనొప్పులూ – డాక్టర్లకి అంతుపట్టని జబ్బులూ వస్తున్నాయంటే రావు మరీ! శరీరానికి వ్యాయామం ఉంటేనా.. స్విచ్చేస్తే అన్ని పన్లూ జరిగిపోతున్నాయి.

దాంతో అసలు కన్నా వడ్డీ ఎక్కువయినట్టు మామూలు ఆటలకన్నా మధ్యాహ్నం ఆటలకి డిమాండు పెరిగింది. దాందుంపతెగ కొన్ని సెంటర్లలో అవే రజతోత్సవాలు చేసుకుంటున్నాయిట. పరిశ్రమ అలా కూడా అభివృద్ధి చెందటం మంచిదేననుకో.

కాని, ఇందులో ఓ తిరకాసుంది.

ఏ క్లాసు సిటీల్లో లేడీసు హైక్లాసు మనుషులు కదా! అక్కడ భక్తి సినిమాలు ఎక్కువరోజులు బతికి బట్టకట్టటం లేదు. అటు పంచాయితీ, ఇటు మునిసిపాలిటీ కాని ఊళ్ళలో మాత్రం మల్లారెడ్డిగారన్నట్లు భక్తిరసం 'డ్రెయినేజీ స్కీము లేక డేంజరుగా' మారుతోంది.

ఏ క్లాసు సిటీల్లో మాత్రం పూర్వం కాలేజీ కుర్రాళ్ళు మాట్నీలకి మాత్రమే అటెండెన్సు వేసుకుని పోయేవాళ్ళు. ఇప్పుడు 'దుస్తుల పొదుపు' నటీమణులొచ్చాక శృంగారం ఆకాశం నుంచి సైడు కాలవల్లోకొచ్చేసింది. పదకొండింటికే హాలు దగ్గర అటెండెన్సు వేసుకుంటున్నారు.

సినిమాలు చూడ్డం కూడా ఓ విజ్ఞానమే. కాదన్ను.. కానీ అసలు జ్ఞానం అరసున్నయి పోతోందే అని దిగులేస్తుంది.

సరే, నెలజీతగాళ్ళకి సంసార సాగరంలో గజీత ఈదేసరికే ఒంటికి సలపరం వొచ్చేస్తోంది. పాలకీ, పంచదారకీలాగే నెలకి రొండు సినిమాలు చేర్చేసరికి బడ్జెట్టు కాస్తా ఒట్టిపోతున్న గొడ్డులా తన్నేస్తోంది. ఓవర్ డ్రాఫ్టులివ్వటానికి కేంద్రప్రభుత్వంలాంటి అత్తగారుంటే పరవాలేదనుకో. అదీ – కేంద్రానికి లొంగివుండి మంచి అనిపించుకుంటే కుదిరే ముచ్చట.

ఈ ఊరికి మధ్యాహ్నం ఆటలొచ్చిన కొత్తలో అదో విడ్డూరంగా ఉండేది. 'అదేవిటమ్మా! మిట్టమద్దాన్నం మద్దెల్దరువ'న్నట్లు ఆడంగులు ముక్కున వేలేసుకునేవాళ్ళు. అలా అన్నవాళ్ళే సనసన్నగా ఒకరికి తెలీకుండా ఒకరు చూసొచ్చేవారు.

'అలా మా పెద్దమ్మగారింటికెళ్ళొచ్చాను పిన్నీ' అని ముందు బొంకినా – నిజాలు దాగుతాయా?

అదీ ఆడవాళ్ళ నోట్లో..

ఆ మీదట పదిమందీ కలిసి మీటింగులకి వెళ్ళినటు బయలేరటం మొదలెటారు.

అప్పటికి నేను రిటైరవలేదు. తల్నొప్పిగా ఉండి మధ్యాన్నం ‘సిక్‌లీవ్‘ పెట్టి ఇంటికొస్తే తాళం వేసుంది. ఇరుగూ పొరుగూ కూడా అలాంటి తాళంతోనే రాగం తానం పల్లవి అందుకుని సినిమాకెళ్ళారని తెలిసింది. ఉసూరుమంటూ వరండా అరుగుమీదే నడుం వాల్చా!

ఇంకో గంటగ్గాని రాదనుకున్న మీ పిన్ని సుడిగాలిలా అరగంటలో వచ్చేసింది. ‘పాడు సినిమా, పాడు సినిమా‘ అని సణుగుతూ తాళం తీసింది. నామీద జాలితోనో, సినిమా మీద కోపంతోనో స్టౌ మీద కాఫీకి నీళ్ళు పడేసింది. పొద్దుటి అంట్ల గిన్నెలలాగే ఉన్నాయి.

నేను అవాక్కయి వింటం తప్ప మరేం చేసే ఓపిక లేక కాఫీ కోసం గుటకలేస్తూ వంటింటి గుమ్మం దగ్గరే చేరా!

‘పాంచాలిట.. పాంచాలీ‘ అంది, పంచభర్తృకా అని పళ్ళు నూరే రారాజులా!

‘ఆ పేరెందుకు పెట్టాలసలు? ఓ కృష్ణుడూ లేడు పాడూ లేదు. పాటలసలే లేవు‘ అంటూ కాఫీ గ్లాసు చేతికందించింది.

ఆ ఆనందంలో ‘ఏం సినిమా?‘ అని మాత్రం అడిగాను.

‘పత్తేర్ పాంచాలిట! సగం చూసి లేచ్చక్కా వచ్చాం‘ అంది.

కాఫీలో పంచదార లేదు. విషం తాగుతున్నట్టుంది. పైగా మీ పిన్ని మాటతో కోపం పంచదార ధరలా పెరిగిపోయింది.

ప్రపంచ ప్రఖ్యాత దర్శకుడు సత్యజిత్‌రే తీసిన సినిమాని పట్టుకుని అలా దులిపేస్తుంటే పంచదార వేసుకున్నా కాఫీ సయించలేదు.

‘పంది బురదమెచ్చు, పన్నీరు మెచ్చునా‘ అన్నాను, ధర్మరాజు ‘కుంజరః‘ అన్నంత నెమ్మదిగా! నాకేసి ఎగాదిగా చూసి ‘ఏవిటి గొణుగుతున్నా‘రంది ఉరిమినట్టు.

‘అబ్బే! ఏం లేదు. ‘పనిది‘ - రాలేదుగదా - అంట్ల గిన్నెలవీ అలాగే ఉంటేనూ‘ అని అచ్చుతప్పు సరిదిద్దేసుకుందామనుకున్నాను. కానీ ఆ మాట కాస్త నోరు జారితే ‘మీరు ఆ మాత్రం చేసాయం చెయ్యకూడదా - పైగా ఓ పూట సెలవ కూడా తగలెట్టారాయె‘ అని అంట్లకి ఆజ్ఞ జారీ చేస్తుందేమోనని భయమేసి గుక్కెడు కాఫీతో పాటు ఆ మాటలు కూడా మింగేశాను.

ఆవిడ మాటలకేం గానీ - రేపు మధ్యాహ్నం ‘అర్ట్‘ సినిమా వేస్తున్నార్ట.. సెలవపెట్టి రాకూడదు.. వొద్దులే - ఏదో పనుందని మీ పిన్నితో చెప్పి నేనే మీ ఆఫీసుకొస్తాను.

‘ఈసారి సెకండ్ సాటర్డే సన్డే వొచ్చింది సార్‘ అని డోకొచ్చే పాచ్చింతకాయ జోకొకటి మీ ఆఫీసరు మొహాన పడేసి, రొండింటిదాకా పర్మిషనడుగు.

మరిచిపోకు సుమీ..

ఈ ఆడాళ్ళు అలాటి సినిమాల్ని పోషించరు.

‘నేడే బ్రమ్మాండమైన ఆఖరాట‘ అనొచ్చు హాలువాళ్ళు!




3

<u>***నువ్వు...నువ్వే!***</u>

బొట్టూ గిట్టూ దిట్టంగా పెట్టావ్..

చెవిలో పువ్వొకటే తక్కువ.

ఇదంతా భక్తే!

ఈ వేషంతో పిన్నిగ్గాని కనబడేవ్.

పసుబ్బట్టలు బలవంతాన కట్టించి, మరదలి కూతురి మెళ్ళోనో తాళి కట్టించేస్తుంది.

ఆ పని జరక్కుండా ఇన్నాళ్ళు అడ్డుపడుతోంది నేనేనని తెలిస్తే ఆ నాలుగక్షింతలూ నా నెత్తిమీద పడిపోతాయ్!

నిజంగా గుళ్ళోంచే వొస్తున్నానంటావ్?

నమ్ముతాను. నీ వయసు కుర్రాళ్ళు గుళ్ళచుట్టూ ప్రదక్షిణలు చెయ్యటానికి అనేకానేక కారణాలుంటాయి. అవన్నీ నాకు తెలీవనుకోకు. నేనూ నీ వయసునుంచి వచ్చినవాణ్ణేగదా!

నేను శుద్ధ నాస్తికుణ్ణి.. అంటే ఆస్తిలేని వాణ్ణి. `ఇది నయీ తత్పురుష సమాసము` అని చెబుతార్లే గ్రామరు మాస్టర్లు.

గుళ్ళో కెళ్ళినందువల్ల నిన్ను వెలెయ్యను గాని, `మనసా వాచా కర్మణా` అంటారు చూడూ - అలా అయితే వెళ్ళు.. నాకభ్యంతరం లేదు. ఎవరి నమ్మకాలు వాళ్ళవి.

`చిత్తం శివుడి మీద భక్తి చెప్పుల మీద` అయితే మాత్రం గుళ్ళో కెళ్ళటం శుద్ధ టైమ్ వేస్టు.

కొందరి దృష్టిలో దేవుడు అనబడేవాడు అణువణువునా ఉంటాడు. అంటే నీలోనూ ఉన్నాడు - నాలోనూ ఉన్నాడు. చివరికి - అమితమైన భక్తితో పూజగదిలో కూచుని గొంతు చించుకున్నట్టు మంత్రాలు చదువుతూ, మనసులో మాత్రం పాలవాళ్ళ నాగాలూ, చాకలి

పద్దులూ లెక్కలు కట్టే మీ పిన్నిలో కూడా ఉన్నాడు. అలాంటి వాళ్ళలో కొందరు - దేవుడి కోసం ఎక్కడో దేవుళ్ళాడక్కరలేదు. కొండలూ, కోనలూ తిరగక్కర్లేదు. చెట్టూ పుట్టా వెతకక్కర్లేదు అంటారు.

మరి కొందరు, అలాక్కాదూ - మనసు కడు చంచలమైనది గనక దానికి నిలకడ కల్పించడానికి ఎక్కడో ఓ చోట, ఓ విగ్రహం ముందు కూచుని ధ్యానం చేసుకోవాలంటారు. వీళ్ళలోనే ఇంకో 'తెగ' ఉంది. వాళ్ళు స్థల మహాత్యాన్ని తెగ నమ్ముతారు. చిన్న తిరపద్దేవుడి కంటే పెత్తిరపద్దేవుడికి పవరెక్కువంటారు. ఆదాయం, ఆస్తిపాస్తుల విషయంలో ఆ మాట రైటేననుకో! ఆ స్థలంలో ఏదో శక్తి లేకపోతే దేశదేశాల్నించీ ఇన్ని లక్షలమంది అన్ని కష్టాలు పడి అక్కడికెందుకొస్తారు అని వాదిస్తారు. అక్కడ హుండీలో పడేస్తేనే వడ్డికాసులవాడు కుబేరుడి బాకీ తీర్చిన గుండె నిబ్బరం కలుగుతుందిట!

దేవుడి సంగతి దేవుడెరుగు. అమెరికా రుణం, కనీసం వడ్డీ ఎలా తీర్చాలా అని ప్రజలముందు ఆందోళన పడుతుంటారు పదవిలో ఉన్నన్నాళ్ళూ మన పొలిటీషియన్సు.

ఉదాహరణకి తిరుపతి వెంకన్న పేరు చెప్పాగాని, మిగతా దేవుళ్ళని కించపరచటం నా ఉద్దేశం కాదు.

**గుళ్ళోకెళ్ళావు.. .. బావుంది!**

ప్రమోషను కావాలనో, నీ కోళ్లర్కుకి ప్రమోషను రాకూడదనో కోరుకోటానికి వెళితే మాత్రం నాకు నచ్చదు.

ప్రేమ దేన్నీ ఆశించకూడదు. భక్తి కూడా అంతే అన్నది నా సిద్ధాంతం. ఏడో క్లాసు, పదో క్లాసు కుర్రాళ్ళు కొందరు పరీక్ష రోజుల్లో తప్పనిసరిగా దేవుడికి ప్రదక్షిణలు చేస్తారు. పూజారికి దక్షిణలిచ్చి శఠగోపం పెట్టించుకుంటారు. మిగతా రోజుల్లో ధర్మేంద్రని, జితేంద్రని ఇంద్రచంద్రుల్లా పూజిస్తారు. హేమామాలిన్ని, రేఖని చేతిలో శ్రీకారం చుట్టుకుని ఆరాధిస్తారు. వాళ్ళగురించి ఆపాదమస్తకం చర్చిస్తారు. అభిమాన సంఘాలు స్థాపిస్తారు. అది ఆఖరికి ఆవగింజంత కాస్తా వేపకాయంత వెర్రిగా మారి సిగపట్లదాకా వస్తారు. అలాంటివాళ్ళని చూస్తే వీళ్ళా భావిభారత పౌరులు, జాతిపౌరుషాన్ని కాపాడే వీరులు, మన తరువాత తరాలకి ఏలికలు అని భయమేస్తుంది. అయ్యోపాపం! అని జాలేస్తుంది.

***కొందరు కష్టాలొస్తే ఆస్తికులు.***

అవి తీరగానే నాస్తికులు. జనంలో వీళ్ళశాతమే జాస్తి! కొందరు ఆస్తి పెరిగిన కొద్దీ భక్తి పెంచుకుంటారు. ఎత్తయిన గోపురాలతో గుళ్ళు కట్టించేస్తారు. సశాస్త్రీయంగా విగ్రహప్రతిష్ఠ చేయిస్తారు. మళ్ళా వాళ్ళే ఆ గుళ్ళకి ట్రస్టీలుగా ఉండి దేవుడి రాబడి కాపాడే బాధ్యత నెత్తినేసుకుంటారు. ఆవిషయంలో మెట్లమీద పేర్లు చెక్కించుకున్న చందాదారుల్ని, గుళ్ళో పూజారుల్ని, చివరికి ఉత్సవ విగ్రహాల్ని కూడా నమ్మరు. తమరే ట్రస్టీలుగా ఉండాలని పదిమందితో అనిపించుకుని ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. వాళ్ళలో ఒక 'గ్రీవం' కలవలేదనుకో - వాడు పోటీ గుడి కట్టేసి, దీనికి నేనే ట్రస్టీని, నాకు నేనే జై అనుకుంటాడు.

భక్తుల గురించి తేలిగ్గా తీసిపారేసినట్టు మాటాడుతున్నాననుకునేవ్! వాళ్ళలో ఎన్ని గ్రూపులున్నాయో, నాస్తికుల్లోనూ అన్ని గ్రూప్ ఫోటోలకి సరిపడే జనం విడివిడిగా ఉన్నారు.

గిరీశం అన్నట్టు కొందరు పగలు 'యాంటీనాచ్' రాత్రి ప్రోనాచ్', కొందరు ఉన్నఊళ్ళో 'యాంటీ నాచ్' పొరుగూరెళ్తే 'ప్రోనాచ్'!

అల్లాగే కొందరు వేదికలెక్కితే నాస్తికులు అవి దిగగానే ఊసరవెల్లులు. వాళ్ళకి రెండు నాలికలుంటాయి. వాటికి మళ్ళీ మైక్రోస్కోప్‌లో కూడా కనబడని చీలికలుంటాయి.

'నాకసలు దేవుడిమీద వీసమైనా, సవాశేరైనా నమ్మకం లేదు. కాని.... తెల్లారిలేస్తే లోపల తిట్టుకుంటూనే, మనకు పనున్న అడ్డమైన వాళ్ళకి దణ్ణాలు పెడుతున్నామే! మన పై ఆఫీసర్లకి దండప్రణామాలు చేస్తూ మేలుకొలుపు నించి పవళింపు సేవదాకా భక్తిరంజని పాడుతున్నామే... అలాంటిది దేవుడూ లేడనే అనుకుంటూ ఓ దణ్ణం పారేస్తే నష్టవేమిటి?'

'నేను దేవుణ్ణి నమ్మను గాక నమ్మను. కానీ మా ఆవిడ రోజూ పూజలు చేస్తుంది. హారతి తెచ్చి కళ్ళకద్దుకోమంటుంది. తీర్థ ప్రసాదాన్నిస్తుంది. ఇంత కుంకుంబొట్టు మొహాన మెత్తుతుంది. ఇవన్నీ మనకిష్టం లేకపోయినా చేశామనుకో - ఆవిడ సంతోషిస్తుంది. సంతృప్తిపడుతుంది. కనబడని దేవుడికన్నా కట్టెదుట కనబడే జీవి, జీవితభాగస్వామి కోసం ఆ మాత్రం చేస్తే కష్టవేమిటి?'

మరికొందరు రాతల్లో నాస్తికులు, చేతల్లో ఆస్తికులు. గిట్టుబాటవుతుందనుకుంటే పెసరట్టులా ప్లేటు తిప్పేసి అక్షరాలు అమ్ముకోగలరు. అలాటి రచయితలు జాతికే అరిష్టం! రాతల్లో మోసం చేసేవాళ్ళు అద్దంతోనూ, డైరీతోనూ కూడా అబద్ధాలాడగల్రు.

***ఏవిటో...***

నీ వేషం మైనస్ పసుబ్బట్టలు చూస్తుంటే ఏ రోజెలా మారతావో అని అనుమానం వచ్చేస్తోంది. నీలో మార్పు మరోడికి ప్రమాదం కానంతవరకూ పరవాలేదు. ఇంకోరితో ముడిపడితే మాత్రం ఎపుడో ఒకప్పుడు నువ్వే ముద్దాయివి, లాయరువి, జడ్జివి కావలిసొస్తుంది. అప్పటికి లేటయిపోయి కన్నుమూసేముందు 'నేనేవిటి?' అన్న ప్రశ్న వేసుకునే టైముండదు. ఉన్నా ప్రయోజనం ఉండదు 'డాక్టర్ ఫాస్టస్'లాగా -

అంచాత, 'కొత్తమతం పుచ్చుకుంటే గుర్తులెక్కువ' అనే సూక్తి గ్యాపకం పెట్టుకో -' చెల్లని నాణేనికే గీతలెక్కువ చేతకానమ్మకే చేష్టలెక్కువ' అనే మాటలు టక్కున గుర్తొచ్చి నీకే సిగ్గేస్తుంది.

***అబ్బెబ్బే!***

ఇలా అంటున్నానని బొట్టు చెరిపేసుకోకు.

తిరపతెళ్ళు... తలనీలాలివ్వు.

నీ గుండు - గంధ్రయసకతో తోమి బోర్లించిన రాగిచెంబులా ఉందని ఎవరో నవ్వుతారని టోపీ మాత్రం పెట్టుకోకు - అలా పెట్టుకుంటే ఇంకోడి నెత్తిన టోపీ పెట్టావన్నమాటే!

అయ్యప్పమాల వేసుకో.. మధ్యలో మాలతీసి మంచం కోడుకి తగిలించి తప్పుడు పనులు మాత్రం చేయకు. చేశావో అది హాబీగా, జబ్బుగా మారి క్రానిక్‌వి అయిపోతావు.

తద్దినాలు పెట్టు.. ఎందుకొచ్చిన తద్దినమ్రా బాబూ! అని మాత్రం అనుకోకు.

లోపల గంట వినిపిస్తోంది. మీ పిన్ని పూజ పూర్తయినట్టుంది. భక్తి శ్రద్ధలు నటించకు. ఇష్టం లేకపోతే, కాఫీ తాగందే దేవుడి ప్రసాదం తీసుకోనని ఇవాళే మొక్కుకున్నానని చెప్పు. ఆ అబద్ధం వల్ల ఎవరికీ నష్టం లేదు.

నా సంగతంటావా?

నేను మితభాషిని.. మీ పిన్నితో వాదనెందుకని, లాస్టే అయిటమ్ నైవేద్యం మాత్రం శ్రద్ధగా పెడతాను.




4

***<u>అద్దె ఇళ్ళన్నాక ఇబ్బందులు తప్పవయ్యా!</u>***

పల్లెటూళ్ళలోలాగా ఉండాలంటే ఎలా కుదుర్తుంది.

గాలొస్తే వెలుతురుండదు. వెలుతురుంటే గాలి ఆడదు.

రొండూ ఉంటే సెప్టిక్ లెట్రినుండదు.

అన్నీ ఉంటే - నీతో పాటు పక్క పోర్షన్లలో ఉండేవాళ్ళతో ఏవో చిలిపి తగూలు - మీ గుమ్మంలో వానచినుకు మా ముగింట జారిందనో, మీ పెరట్లో ఆనప్పాదు మా వేపు వేసే కాయలు మావేననో - ఏదో రగడ. అదీ లేదనుకుందాం.

ఇంటావిడతో.. అదేనయ్యా! నువ్వద్దెకుండే ఇల్లుగలావిడతో కరెంటు దగ్గరో, రాత్రి పద్దాటాక నీకోసం వీధి తలుపు తియ్యటం దగ్గరో మాటా మాటా వచ్చేస్తుంది. ఎలాగో సర్దుకుపోవాలి.

హోటల్ భోజనం, మఠం నిద్రా కాబట్టి నీలాంటి బ్రమ్మచారికి ఈ గొడవల్లావు. వచ్చినా ఆడనోటికి జడిసి తలొంచుకుపోతావు.

***<u>నీ తత్వం నాకు తెలుసుగా!</u>***

అసలు నువ్వాగదిలో ఉండేదెన్నిగంటలు? పనిపిల్లొచ్చేసరికి నువ్వు నిద్రలేవవు. నువ్ లేచేసరికి పనిపిల్ల డ్యూటీ దిగిపోతుంది. మొహం కడుక్కోటానిక్కూడా నీటి చుక్కండదు. ఎలాగో కాఫీ కోసం బజార్న పడతావా... ఇహ స్నానానికి.. అన్ని వాటాల వాళ్ళకీ కామన్ బాత్రూం అయితే తుండు భుజాన వేసుకుని, సబ్బిళ్ళ చేత్తో పట్టుకుని క్యూలో నుంచోవాల్సిందే - బాత్రూం తలుపులకి గడియ లేదనుకో. చచ్చినట్టు సంగీతసాధన చెయ్యాల్సిందే లేకపోతే వాకిట్లో పెట్టుకున్న 'ఇన్ అండ్ అవుట్' బోర్డు బాత్రూం గోడక్కొట్టుకోవాలి.

లెట్రిన్ దగ్గర కూడా క్యూ ఉంటే అవస్థే! అయినా - పేషన్స్. ఓర్పు తప్పదు. పదింటికి ఆఫీసులో అడుగుపెడితే అయిదింటిగ్గాని బయటపడవు గదా. అదీ నీ చాకచక్యాన్ని బట్టి, కొన్ని ఆఫీసుల్లో రాత్రి పదింటిక్కూడా గడియారం అయిదుకొట్టదు. ఆ దురవస్థ నీకు లేదు గనక ఏదో సాయంకాలక్షేపానికి ఇలా రాగలుగుతున్నావు.

ఇల్లుగలావిడకి పెళ్ళీడు కొచ్చిన ఆడపిల్లలున్నారనుకో, గదిలో చేరిన కొత్తల్లో నీదే వైభోగం. సమస్త సదుపాయాలూ సమకూడతాయి - చెడర్థం తీసుకోకు సెన్సారాఫీసర్లాగా.

కాఫీ టిఫినూ, అప్పుడప్పుడు స్పెషల్ భోజనాలు అమరుతుంటాయి. తల్నొప్పి వచ్చి ఒంటరిగా బాధపడుతున్నావనుకో - 'ఆరింటికే లేచే పిల్లాడు ఎనిమిదైనా లేవలేదు. ఊష్ణంగాని వొచ్చిందేమో చూసిరావే' అని ముందు పనిపిల్లని, తరువాత తన పిల్లని పంపిస్తుందావిడ. అదో సౌకర్యం.

నీ గుణగణాలు కొన్నాళ్ళపాటు ఇతరవాటాల్లో మోగిపోతాయి. సోదర మగమహారాజులకి తిట్లు కూడా తగుల్తాయి.

ఆ తరువాత నీకు మేనరికం ఉందనో, పెళ్ళి చూపులకెళ్తున్నావనో, సమ్మంధం కుదరబోతోందనో తెలిసిందా - ఇంటావిడ కాదు కదా పనిపిల్ల కూడా నీ మొహం చూడదు.

ఓ మంచి రోజు చూసి 'మా బంధువులొస్తున్నారు నాయనా! ఓ పన్నెండు గంటల్లో గది ఖాళీ చేసి వేరే చోటు చూసుకో' అని కోర్టు అమీనాలాగా ఆ మీనాక్షమ్మ నీకు నోటీసిస్తుంది.

***మళ్ళా గదివేటకి మొదటికొస్తావు.***

'ఈ ప్రాంతంలో గదులేవైనా పోనీ దూరమైనా పరవాలేదండీ. పంపుదేవుందండీ ఓ కూజా నీళ్ళు తెప్పించుకుంటే రోజు వెళ్ళమారిపోతుంది. అదివరకటికన్నా ఓ పాతికెక్కువయినా సరే' అని కంఠశోష, కాళ్ళతీట తప్పదు.

గంగాభాగీరథీ సమానురాలైన మీ ఇంటావిడ మీనాక్షమ్మగారు మంచిదేననీ, పైగా పెళ్ళీడు ఆడపిల్లల్లేరనీ చెబుతున్నావు గనక గాలీ వెలుతురు అంటూ కిటికీ చువ్వలు పట్టుకు వేళ్ళాడకుండా సుబ్బరంగా అక్కడే సెటిలయిపో.

ఒహవేళ మీ ఆఫీసువాళ్ళు నీకు క్వార్టర్సు కేటాయించారనుకో. వారఫలం బావుందనుకుని అందులో దూరిపోకు.

***బ్రహ్మచారివైన నిన్ను కష్టాలు కాకుల్లా పొడుచుకుతింటాయి***

క్వార్టర్సు రాని ఫామిలీ కొలీగ్స్ నీమీద పడి ఏడుస్తారు. వచ్చిన పక్క క్వార్టర్సు వాళ్ళు నీమీద పడకుండా ఏడుస్తారు. పిల్లల స్కూలోమూల, మా ఆవిడ కుట్టుమిషను సెంటరో మూల, మన ఆఫీసు ఐమూల అని వాపోతారు అద్దిళ్ళ కొలీగ్సే.

నీకు అంతగా భూతదయ, జాలిగుండె ఉంటే - వాళ్ళతో బేరంపెట్టు. నేను ఒక్కగదికీ వందరూపాయలిస్తున్నాను. నాకు కేటాయించిన క్వార్టర్సు మీ సొంతం. నాగది నాకుంటుంది. ఆఫీసరుగారిని ఒప్పించే పూచీనాది - అని లోపాయికారీగా ఒప్పందం కుదుర్చుకో - పెళ్ళయితే మాత్రం తక్షణం ఖాళీ చెయ్యాలని షరతుపెట్టు. అలాటివి చేతకాదని, గది ఖాళీ చేసి క్వార్టర్సులో చేరిపోయావనుకో. అనుభవం ఉన్నవాణ్ణి కాబట్టి చెబుతున్నాను.

'సంసార్ల కొంపల మధ్యకి వీడొచ్చిపడ్డాడేవిటమ్మా! తొమ్మిదింటికి నిద్రలేస్తాడు. వాకిట్లో ఓ శుభ్రత లేదు. కళ్ళాపి లేదు, ముగ్గూ లేదు. చూడ్డానికే అసయ్యం' అంటుందొకావిడ.

'వాకిలి సంగతి సరేనమ్మా! ఇంట్లో ఓ బిందెడు నీళ్ళన్నా ఉండవు - స్నానమన్నా చేస్తాడా అని.'

'స్నానం సంగతి నాకు తెలీదుగాని పానం మాత్రం చేస్తాడు. సంధ్యవార్చడు గాని, వాళ్ళాఫీసు టైపిస్టుకి సంధ్యావందనాలు చేస్తాట్ట. మా ఆయనన్జెప్పారు.'

'అయినా బ్రహ్మచార్లకి క్వార్టర్సివ్వటవేవిటీ పై వాళ్ళకి బుద్ధిలేకగానీ సంసార్లకిస్తే పిల్లాపాపతో కళకళ్ళాడుతూ మనతో సాయిలాపాయిలాగా ఉంటారు.'

'ష్షో.. వొస్తున్నాడు, తూల్తున్నట్టు లేదూ..'

ఇలా ఉంటాయి రోజా నువ్వు వినాల్సిన మాటలు. చెవులు మూసుకున్నా సరే ఎలాగొలా మనసుకి పట్టేసి నిద్దరట్టకుండా చేస్తాయి.

సాయిలాపాయిలాగా ఉండటమంటే - కాఫీపొడో, పంచదారో, కిరసనాయిలో ఇచ్చిపుచ్చుకోటాలన్నమాట.

మళ్ళీ నీ జాలిగుండె మంచుగడ్డలా కరిగిపోయి నీ రేషన్‌కార్డు ఓ కొలీగ్‌కి ఇచ్చావనుకో. మిగతా కొలీగ్స్ యొక్క అంతఃపురకాంతలు కారణాలు వెతుకుతారు. వీలైనన్ని తప్పులు పట్టి నిన్నూ, నీ కొలీగ్‌నీ కూడా వెలేసినట్టు చూస్తారు.

బ్రమ్మచారిగా సుఖపడుతున్నావనీ, బాంకులో నాల్రూపాయలు దాచుకుంటున్నావనీ, నవ్వుతూ తుళ్ళుతూ తిరుగుతున్నావనీ అసలు కడుపుమంట. అది లోపల దాచలేక, లోపల ఇమడక మరో రూపంలో బురద జల్లేస్తారు. కనక -

నా మాట విని, ఉన్న గదితోనే సద్దుకుపో. అదిలేదిది లేదని చికాకు పడితే, ఆ చికాకు ఆఫీసులో నీ పనిమీదపడి, శ్రీవారి చివాట్లు క్షకారాంతందాకా తీసుకెడతాయి.

అంతగా తోడులేక ఒంటరితనంతో బాధపడుతున్నావనుకో, - మీ ఆఫీసులో మరో బ్రమ్మచారినో, చదూకునే కుర్రాణ్ణో గదిలో చేర్చుకో. అద్దె కాస్త కలిసొస్తుంది. చదూకునే కుర్రాడయితే మరీ మంచిది. ఆడాళ్ళు అనుకునేట్లు కాఫీగ్రటా పత్రాటానికి సాయిలా పాయిలాగా ఉంటాడు. అదో అదనపు లాభం.

●●●




5

***మొన్ననే గదయ్యా మా*** 'లాండ్ లేడీ' చాలా మంచిదని సర్టిఫికెట్టిచ్చావ్. ఇంతలో ఏవైంది?

కొంపదీసి ఆడాళ్ళ నోట్లో నానే పనేమైనా చేశావా. నీకంత ధైర్యముందని నేన్నమ్మను.

చూడూ, -

పాలవాళ్ళతో, పనిమనుషుల్తో లాగే, ఇల్లుగలవాళ్ళతో కూడా కాస్త నేర్పుగా ప్రవర్తించటం నేర్చుకోవాలి.

నోరు మంచిదయినంత మాత్రాన ఊరు మంచిదవుతుందన్న సామెతకి కాలం చెల్లిపోయింది. నోటి మంచితనంతో పాటు చేతల్లో కూడా మంచితనం చూపించాలి.

***ఎల్లాగంటావ్?***

అయిదారు కాపరాలకి ఇల్లద్దెకిచ్చి, మగదిక్కు లేకుండా గంభాసా మీనాక్షమ్మగారు ఒక్కతే నెట్టుకొస్తోందంటే ఎంత కష్టవో ఆలోచించు. మొదటి తారీకునే 'ఇదిగోండి పిన్నిగారూ, ఒదినగారూ' అంటూ అందరూ అద్దె తెచ్చి చేతిలో పెట్టరుగదా!

డబ్బున్నా ఇవ్వాలనిపించదు కొందరికి. ఈ నెల ఇవ్వకపోతే అద్దెడబ్బుతో ఏదేనా వస్తువు కొనుక్కోవచ్చనిపిస్తుంది.

అయిదార్నెల్లు అద్దె డబ్బు ఆపేసి, ఆఫీసులోనే వడ్డీకి తిప్పితే - అసలు అసలుగా మిగిలి వడ్డీ డబ్బుతో అద్దె కట్టెయ్యొచ్చు అనే 'యురేకా' అయిడియా వస్తుంది కొందరికి.

***ఒంటరి ఆడది.***

మగదిక్కు లేదు కాబట్టి కోర్టుకెక్కలేదు. కోర్టుకెక్కినా - అద్దెడబ్బు కోర్టులో కట్టేస్తూ కొన్ని తరాలు అద్దె పెంచనివ్వకుండా ఇక్కడే గడిపెయ్యొచ్చుననిపిస్తుంది కొందరికి.

వీళ్ళందరికంటే మేధావులుంటారు కొందరు. అద్దె కట్టక, ఖాళీ చెయ్యక ఓ పది పదిహేనేళ్ళు అడపా తడపా ప్లీడర్ని తడిపేస్తూ గడిపేస్తే -

తను అద్దెకుంటున్న వాటా తను అడిగిన రేటుకి తనే కొనుక్కోవచ్చునన్న పంచవర్షపు ప్రణాళికాలోచనల్తో పథకం వేస్తారు. ఈలోగా ఇంటావిడ బాల్చీ తన్నెయ్యకపోతుందా అని కూడా ఊహ చేస్తారు.

అలాంటి వాళ్ళని ఎర్రటోపీల వాళ్ళే ఏం చెయ్యలేరు - తెల్లముసుగేసుకున్న మీనాక్షమ్మగారేం చెయ్యగలరు?

అన్నట్టు మీ 'లాండ్‌లేడీ' సకేశా? అకేశా?... అదేనయ్యా -

శిరోజ సంపద కలిగినావిడేగదా! అలాంటివాళ్ళు కాస్త వయసు మళ్ళిన వాళ్ళయినా మనసు పడే మగవెధవలుంటారు కొందరు.

'నిన్ను ఉంచుకునే వయసు దాటిపోయింది నాయనా! పెంచుకునే వయసు నాది' అని ధాష్టీకంగా తెగేసి చెప్పగలిగినావిడయితే నెగ్గుకురాగలదు. లేదా..

అద్దెకుండేవాళ్ళు - వారి వారి వాటాలకి వాళ్ళే హక్కుదార్లయిపోయి, తనే ఆ ఇంట్లో అద్దెకుంటున్న అనుమానంలో పడిపోతుందావిడ కొన్నాళ్ళకి.

మోటు సామెజ్జెప్పినట్టు 'ఇల్లు కట్టగానే సంబడం కాదు. కట్టిన ఇల్లు ఎవరి పేర్న పెట్టాలి. వాళ్ళనెట్లా గుప్పెట్లో పెట్టుకోవాలి. అద్దెకొచ్చేవాళ్ళు నెలనెలా జీతాలొచ్చేవాళ్ళో కాదో వాకబు చేసుకోవాలి. వాళ్ళతోపాటు గోడలక్కొట్టే పటాలెన్ని దిగుమతవుతాయి, ఎన్ని మేకులు కొడతారు. మేకుల్తోపాటు గోడలు పడగొట్టే పిడిగుల్లాంటి పిల్లలెందరున్నారో, వాళ్ళు తల్లిదండ్రుల అదుపాజ్ఞల్లో ఉంటారో లేదో ఆరాలు తీయాలి. ఇన్ని చూసి కన్నబిడ్డని అత్తింటికి అప్పజెప్పినట్టు అద్దెకియ్యాలి. ఫస్ట్‌తారీకున ముక్కుపిండి మరీ వసూళ్ళు చేసుకోగలగాలి' ఇంత కథుంది. అంతేగానీ నేను వైజాగ్‌లో ప్లాటు కొన్నాను. హైదరాబాదులో ప్లాటు కొన్నాను. బెజవాడలో ఇల్లు కట్టాను. వైజాగు 'ఉడా', హైదరాబాదు 'హుడా', బెజవాడ 'బుడా' అన్నీ నా చేతుల్లో ఉన్నాయనుకుంటే సరిపోదు.

నువ్వు ఏ అంబాజీపేటకో ట్రాన్స్‌ఫరయిపోతే ఇవన్నీ మేనేజ్ చేసుకోగలగాలి. లేకపోతే, ఇళ్ళమీద రావాల్సిన అద్దెలు కాయితాల మీద అంకెలుగా మిగిలి మురిపించినా, గోడక్కొట్టిన సున్నాల్లాగా చేతికి రాక నువ్వు తెల్లబోయేట్టు చేస్తాయి.

పెద్దావిడ ఏం కష్టంలో ఉందో ఏవిటో - ఏదో మాట తూలిందే అనుకో - కన్నకొడుకులా మసులుకోవాల్సిన నువ్వు పెంపుడుకొడుకులా పళ్ళు కొరికితే ఎలా? కాఫీకెళ్ళేముందు 'పిన్నిగారూ! బజారుకేసెళ్తున్నాను. కూరానారా ఏవన్నా కావాలా' అనడగాలి. ఆవిడ పదినోటివ్వబోతే - 'అబ్బే ఎందుకండి.. నా దగ్గిర చిల్లరుంది ఆనక లెక్కల్చూసుకోవచ్చు! అనేసెయ్యాలి. ఆఫీసుకెళ్ళేముందు 'పిన్నిగారూ! ఆఫీసుకెళ్ళొస్తాను' అని చెప్పావనుకో, పెద్దవాళ్ళు ఎంతో మురిసిపోతారు.

వారానికోసారి 'అదేమిటండీ పిన్నిగారూ! అలావున్నారు. ఒంట్లో నలతగా ఉందా? డాక్టర్ని తీసుకురమ్మంటారా! అందాక ఈ అనాల్జిన్ వేసుకుని వేడివేడి కాఫీ తాగండి' అని పరామర్శ చేస్తుండాలి.

నువ్వు చల్లపల్లి వెళ్ళి వయా కొండపల్లి బస్సెక్కి ఊరికి చేరినా సరే 'మా అమ్మా నాన్నల్ని చూడ్డానికి బందరెళ్ళానండీ! మీకోసవని స్వీట్లు తీసుకొచ్చాను' అని ఆప్యాయంగా ఇవ్వాలి. ఆవిడకి షుగర్ కంప్లైంటు ఉందనుకో - నువ్వు అదృష్టవంతుడివి. లేదా అప్పుడప్పుడూ బందరెళ్ళి పెద్దవాళ్ళని చూసొస్తుండు నాయనా అని బందరులడ్డూలా తియ్యగా దీవిస్తుంది. బందరు మిఠాయి కొట్లు ఇప్పుడు ప్రతి ఊళ్ళోనూ ఉన్నాయనుకో. కాకపోతే ఖరీదెక్కువ, రుచి తక్కువ.

తోటి అద్దెకున్నవాళ్ళకి ఇంటావిడకీ గిల్లికజ్జా వచ్చి తీర్పుకోసం నీ దగ్గరకొచ్చారనుకో. గోడమీద పిల్లివాటంగా 'పైకి కేపటలిస్టు, లోన కమ్యూనిస్టు, ఎందుకొచ్చిన రొస్టు' అనుకోకుండా ద్విపాత్రాభినయం చేయగలగాలి. పిన్నిగారూ! మీరే కరెక్టంటే పక్కింటి అక్కయ్యగారికి నువ్వు పరాయివాడివయిపోతావు. వాళ్ళాయన కొంపకి రాగానే నీమీద నాలుగు కల్పించి చెబుతుంది. బైటపనుల్తో అసలే చికాకులో ఉంటాడు వాడు - మొగాడైతే పెళ్ళాం నోరు మూయిస్తాడు. లేదా ఇల్లుగలావిడ మీదకి యుద్ధానికెడతాడు. క్లబ్బులో రెండు బాంకులు పోగొటుకున్న ముహూర్తంలో నీ రాయబార నైపుణ్యం తెలిసిందనుకో ముందు నీ మీద విరుచుకుపడతాడు. అలాటి వాళ్ళ

నోటికి జడిసి, వాళ్ళ పక్షానే మాటాడావనుకో - నవ్వుబందరెప్పుడెళ్తావు నాయనా' అని పిన్నిగారు నిన్ను ఛస్తే అడగదు సరికదా. ఆ కష్టం ఈ కష్టం చెప్పి ఆర్నెల్ల అద్దె అడ్వాన్సడిగేస్తుంది. ఇవ్వకపోతే నిన్ను కడిగేసి, ఆనక నువ్వుండే గదితాళం పగలగొట్టి, కడిగి ముగ్గులేయించి కొత్తదంపతుల్ని కొంపలోకి దింపేస్తుంది. నీ సామాను వరండాలో భద్రపరుస్తుందనుకో!


అల్లాగే కో-టెనెంట్సుతో కూడా కోపరేటివ్‌గా ఉండాలి. ముక్కు చీవిడి కారుతున్నా వాళ్ళ పిల్లల్ని దగ్గరకి తీసుకుని ముద్దులాడాలి. అప్పుడప్పుడు బిళ్ళో, బిస్కట్టో పడేస్తుండాలి. 'అంకుల్ చాలామంచివాడ'ని వాళ్ళు గొప్ప పబ్లిసిటీ ఇచ్చేస్తారు. నీ గదికి అటూ ఇటూ వాటాలవాళ్ళు మాటామాటా అనుకున్నారనుకో - తెల్లారేసరికి రెండు వాటాల చెత్తాచెదారం నీ గది ముందుకే చేరుతుంది. అప్పుడూ నేర్పు ప్రదర్శించి 'తప్పించుకు తిరుగువాడు ధన్యుడు సుమతి'గానే ఉండాలి కాని, కాలికి అంటిందాన్ని నెత్తికి రాసుకోకూడదు. రాసుకున్నావో - గొర్రెపొట్టేళ్ళ మధ్య మేకపిల్లలా నలిగిపోతావ్.

ఇల్లుగలావిడ పదికాలాలపాటు అద్దెకుండేవాళ్ళకి మద్దతిస్తుందిగాని, రేపో మాపో పెళ్ళిచేసుకుని వేరే ఇల్లు చూసుకునే నీ తరపున మాటాడదు సరిగదా! బందరులడ్డూ తెచ్చావన్న ప్రేమ కూడా చూపించదు.

పైగా ఏ సమితి ప్రెసిడెంటుకో జలుబు చేసి తుమ్మితే ఊడిపోకపోయినా, మరో ఊరికి ఎగిరిపోయే ఉద్యోగం నీది.

బ్రమ్మచారికేం - బేపర్వా! అంటారుగాని - ఆడదానిలాగే అరిటాకులాంటి జీవితం. ఒకోసారి అంతకన్నా హీనం.



6

**ఇన్నాళ్ళూ మనం పడుతున్న** తర్జన భర్జనలన్నీ మీ పిన్ని విన్నట్టుంది. నిన్న నువ్వటెళ్ళగానే నన్ను నిగ్గదీసింది.

'మీకు బుద్ధుందా?' అంది.

'అతనంటే కుర్రాడు. మీ కయినా జ్ఞానం ఉండక్కర్లా?' అని కూడా అంది.

నేనేం మాటాణ్ణు.. మితభాషిని కదా!

విషయవేవిటో తెలీక, ఏం చెప్పాలో తేలక, గిల్లుకోడానికి గోళ్ళు కూడా లేక వింటూ నిలబడిపోయాను.

'నువ్వు ఉత్త అమాయకుడివట. నోట్లో వేలుపెట్టినా కొరకలేవుట. ఎవరి దగ్గరైనా ఇట్టే మోసపోతావుట. అందుకే అయిదారు కాపరాలున్న ఇంట్లో చిన్నగదికి వంద అద్దె ఇస్తున్నావుట. అదీ ఆఫీసుకి దూరమై బస్సుల్తో సతమతమైపోతున్నావుట. ఇంటావిడ చేతిలో ఫస్టుకల్లా బిళ్ళకుడుముల్లా వందరూపాయలూ పోస్తున్నా ఆవిడతో మాటలు పడుతున్నావుట. ఇరుగు పొరుగు తగాదాల్తో తల్నెప్పి తెచ్చుకుని మనఃశ్శాంతి పోగొట్టుకుంటున్నావుట. హోటలు మెతుకులు తినలేక అప్పుడప్పుడూ పస్తులుంటున్నావుట. ఒకోసారి కాఫీ కెళ్ళటానిక్కూడా బద్ధకించి ఖాళీకడుపుతోనే ఆఫీసుకెళ్తున్నావుట'

ఈ విషయాలు మనవేం మాటాడుకోలేదు గదా! అసలిన్ని విషయాలు నీక్కూడా తెలుసో తెలీదో కానీ, నువ్వు అద్దెకుంటున్న ఇంట్లో కాపరమున్న ఒకావిడ మీ పిన్నికి వేలువిడిచిన మేనమావ కూతుర్లే. ఆమెగారు పూసగుచ్చినట్టు నీ గురించి చెప్పి ఒహటే ఇదయిపోయిందట. ఆ పూసలదండ వేసుకునేసరికి ఈవిడకి పూనకం వచ్చింది. అది కాస్తా నా మీద దండకంగా మారింది.

'ఇప్పుడేవంటావ్?' అన్నాను, పాయింటు చెబుతుందేమోనన్న ఆశతో - అబ్బే, - వరసలో మరోగంట నీగురించి, నీ మంచితనం గురించి, నీ గదిగురించి, ఇంటావిడ నోటి దురుసుతనం గురించి పరిశీలనాత్మకంగా, తులనాత్మకంగా ఆత్మవేదన వెలిబుచ్చింది.

'ఇప్పుడేమంటావ్?' అన్నాను మళ్ళీ -

'ఎవడండీ మీకు చదువు చెప్పిన మాస్టరు? ఎవడండీ మీకు ఉద్యోగవిచ్చిన ఆఫీసరు?' అని మళ్ళీ పనస మొదలెట్టింది.

చదువూ ఉద్యోగాల గురించి రిటైరయినాక ఇప్పుడెందుగ్గాని, నిన్ను నాకిచ్చి కట్టబెట్టింది మీ నాన్న - సాక్షాత్తూ నా మేనమామ అందామనుకున్నాను.

మాస్టరు ఆఫీసర్ల మీంచి గాలిమళ్ళి - అట్నించి పుట్టింటారి గురించి మొదలెట్టి నన్ను పెంచిన పీకల్దాకా చెరిగేస్తుందని అనుమానించి వినోబాభావేకి జై అనుకున్నాను. సరే, -

సారాంశమేవిటంటే - నువ్వు అర్జంటుగా ఆ గది ఖాళీ చేసి, మా ఇంటికొచ్చేసి నా గదిలో ఉండాల్ట.

నేనీ ఇల్లు కట్టినప్పుడు సూపర్వయిజేషనంతా ఆవిడదే అనుకో. అయినా, నా రాతకోతలకని - నాతో ప్రత్యేకంగా మాట్లాడ్డానికి వచ్చే వాళ్ళకోసమని ఈ పెద్దగది స్పెషలుగా కట్టించింది.

ఇప్పటికీ - మీ కచేరీగది బాగుచెయ్యాలనో, వెల్లవేయించాలనో అంటూంటుంది.

రిటైరయినాక రాతకోతలు పోయాయిగదా! ప్రత్యేకంగా మాట్లాడ్డానికి ఎవరూ రారు గదా! కచేరీగది ఖాళీ చేసి వరండాలో కృష్ణా రామా అనుకుంటూ కూచోండి - ఆ గది మాత్రం ఆ కుర్రాడికి కేటాయించేశాను అంది.

మనుషులు దగ్గరయిన కొద్దీ మనసులు దూరమవుతాయనే థీరీ నాది. ఇలా వస్తూ పోతూ ఉన్నావనుకో. అదో సరదా, ఖర్చులేని కాలక్షేపం.

ఇవన్నీ నా మనసులో ఊహలు సుమా! ఆవిడతో అనలేదు. అనే ఛాన్సూ దొరకలేదు.

'పెద్దగది - సెపరేట్‌గా బాత్రూం, లెట్రినూ, - మన పనిమనిషికే మరో పదిరూపాయలు పారేస్తే అతనికన్నీ అమర్చిపెడుతుంది. ఇంట్లో కుర్రాడిలా కలిసిపోతాడు. మరో తలకాయకి కాఫీనీళ్ళు పొయ్యటం మనకేం బరువుకాదు. పగలు హోటల్లో తిన్నా, రాత్రిళ్ళు కారియర్ తెప్పించుకుంటే మనం వండుకునే కూరలు కూడా వేసుకుని తీరిగ్గా తినొచ్చు - ఆఫీసుకి దగ్గర - బజారు దగ్గర - హాస్పటలు దగ్గర - బస్టాండు సెంటరు. వాళ్ళ అమ్మా నాన్న ఎప్పుడన్నా చూడ్డానికొచ్చినా, మనింట్లో ఉండచ్చు. శుచీ శుభ్రతకేం లోటురాదు కదా! ఉద్యోగంలో చేరాక హోటలు కూడు తిని పదికేజీలయినా తగ్గుంటాడు - పాపం. ఎంతైనా ఇంట్లో పచ్చడి మెతుకులిచ్చే బలం వేరు.' ఇలా ఇంకా చాలా చెప్పింది కానీ, మధ్య మధ్య నల్లులు కుట్టినట్లు నాకు మెలుకువ వచ్చి 'వందకంటే అద్దె ఎక్కువిచ్చుకోలేడేమోనే' అని కలవరింతలా అన్నట్టు గుర్తు.

'అబ్బో సంబరం.. అతనిచ్చే అద్దె డబ్బుల్తో మరో మిద్దెకడుదురుగాని' అని కసురుకుంది.

ఈసారి ఏనుగులాంటి దోమ కుట్టినట్టయి కళ్ళు తెరిపిన పడ్డాయి. 'ఇప్పుడేం చేద్దామంటావ్?' అన్నాను లేచి కూచుని, కాసిన్ని మంచినీళ్ళు తాగి.

'రేపు మంచిరోజు. నెలాఖరు వరకు అక్కడ అద్దె కట్టేసినా సరే - రేపే వచ్చి ఇక్కడ చేరిపొమ్మనండి. పాలవాడిక్కూడా చెప్పేశాను. పొంగలి కోసం రేపు మరో పావుశేరు ఎక్కువ కావాల్సివస్తుందని'

నేనా... మితభాషిని.

అద్దెకుండాల్సిన నువ్వా.. ఆ సమయంలో లేవు.

అలా ఆవిడ ఏకపక్ష నిర్ణయం తీసేసుకుంటే మనం చేసేదేవుంది చెప్పు. సరే, -

ఈ పూట నువ్వొస్తావు గదా. చెప్పొచ్చని గురక నటించాను.

'మొద్దునిద్రా మీరూను. అవసరమైన విషయాలు మాటాడాలనుకున్నప్పుడే ఆవరింపచేస్తారు.' అని తనూ సణుగుడావలింతతో పడుకుండిపోయింది.

మొగుడిగా కూడా నన్ను రిటైరయిపొమ్మని ఆర్డరేశాక ఇహ చెప్పేదేవుంది?

ఇప్పుడు గవర్నమెంటు వారి చెప్పుచేతల్లో కాదయ్యో నేనున్నది. విషయం చెప్తాను. ఆనక నీ ఇష్టం - అక్కడిచ్చే వందే ఇస్తాడు. అంతకంటే అతన్నిబ్బంది పెట్టటం మంచిది కాదని ఇవాళ రాత్రికి మంచి మూడ్‌లో ఉండగా నచ్చచెప్పటానికి ప్రయత్నిస్తాను. సరేనంటే - గొడవే లేదు.

కాదు కూడదు. కచేరీ గది పెద్దది అని పేచీ పెట్టిందనుకో - ఇవాల్టితో నీకూ నాకూ సరి.

మితభాషణం కూడా మానేసి ఆవిడ చెప్పినట్లే కృష్ణా రామా అనుకుంటూ ధ్యానంలోకి, మవునంలోకి వెళ్ళిపోతాను.

కచేరీ గది తాలూకు మధురస్మృతులు నెమరేసుకుంటా శేషజీవితం గడిపేస్తాను.

అదేవిటోయ్..

నువ్వు కంటతడిపెడతావ్?

నీలాంటి యంగ్‌స్టర్స్‌కి కన్నీరు నప్పదు - జూనియర్ శ్రీరంజనికి నవ్వు నప్పనట్లు.

ఆనంద బాష్పాలా!

సంతోషం... ఇహ నాకు చింతలేదు.

మళ్ళా గడియారాన్ని పాతికేళ్ళ వెనక్కి తిప్పేసి కుర్రాణ్ణయిపోతాను. నీ వంక బెట్టుకుని - కంపెనీ కోసం రమ్మంటున్నాడు కుర్రాడని షికార్లకి, సినిమాలకి తిరిగెయ్యొచ్చు. పోగొట్టుకున్న వసంతకాలాన్ని కళ్ళెం పట్టి లాక్కొచ్చి ఎలకోయిల రాగాలు వినొచ్చు.


మొత్తానికి నాకన్నా నువ్వే మా ఆవిడ 'గుడ్‌లుక్స్'లో ఉన్నట్టున్నావు.

మరి రేప్పొద్దుటే మీ 'లాండ్ లేడీ'కి గుడ్‌బై కొట్టేసి వచ్చేయ్.

మీ పిన్ని నూతన గృహప్రవేశానికి చేసినంత హంగామా చేసేట్టుంది.

పరమాన్నం ఎలాగా చేస్తానంటోంది కాబట్టి అందులో నంజుకోటానికి గారెల కార్యక్రమం చేపట్టకపోదు. రేపట్నించీ నీతోపాటు నాకూ 'గరీబీ హఠావ్!'.



7

***లోకం మారిపోతోందోయ్!***

అలాగిలాక్కాదు.. యమస్పీడుగా మారిపోతోంది. మారటవంటే నీలా గది మారటం, ఇల్లు మారటం అనుకునేవ్!

మనిషి నడకలో, నడతలో, మాటలో, చేతలో పారిస్‌లో ఫాషన్లు మారినంత వేగంగా మారిపోతోంది.

నిన్న నవ్వుతూ పలకరించిన వ్యక్తి ఇవాళ మనం కనబడగానే జీడిగింజలా మొహం మాడ్చేసుకుంటున్నాడు.

పొద్దుటిదాకా మనతో కచ్చిపెట్టుకు తిరిగినవాడు హఠాత్తుగా వచ్చి వాటేసుకుని మనం మనం ఒహటే అని డ్యూయట్టు పాడేస్తున్నాడు. ఇన్నాళ్ళూ వాళ్ళ మాటలూ, వీళ్ళ మాటలూ విని దూరమైపోయామని దుఃఖపడిపోతూ మన భుజం మీది కండువాతో కళ్ళు తుడుచుకుంటున్నాడు.

***ఇంతలో అంత మార్పెలా వస్తోందో అర్థమై చావటంలేదు.***

పోనీ, మనలోనే ఏదైనా మార్పొచ్చిందాని తీవ్రంగా పరిశీలన చేసుకు చూసినా, ఎక్స్‌రే తీయించుకున్నా కనబడటం లేదు. దీనిక్కారణం ఆర్థిక సూత్రమో, రాజకీయం గాలో, సాంఘికమైన అనుబంధంలో మార్పో అయ్యుంటుందనిపిస్తోంది.

ఈ స్పీడుతో పాటు మనం కూడా మారటం అలవాటు చేసుకోవాలి లేకపోతే - గుమ్మంలో గొబ్బెమ్మల్లా, గోడక్కొట్టిన పిడకల్లా, తడిసిపోయిన కట్టెల్లా పొగచూరిపోతాం - కొడిగట్టిపోయి చివరికి ఎందుకూ కొరగాకుండా పోతాం.

అందుకే అన్నాడు మహాకవి శ్రీశ్రీ

**'ఎద్దుబండితో కొలవకు దూరాన్ని**

**ఎగరవోయ్ చదల ఎద చీలుస్తూ'** అని.

ఆ రాకెట్ స్పీడులో వెళ్ళకపోతే, -

పదోక్లాసు కుర్రాళ్ళ కన్నా వెనకబడిపోతాం.

**'మందగించక ముందుకడుగెయ్**

**వెనక బడితే వెనకెనోయ్' అన్నాడు యుగకర్త గురజాడ.**

చూశావా! నువ్వీ ఇంట్లోకొచ్చేసరికి నాక్కూడా యవ్వనం వచ్చేసింది. మోడరన్ పొయెట్రీ మాటాడేస్తున్నాను.

'నిన్నటి మహాకావ్యం పద్దెనిమిది పర్వాలైతే నేటి మహాకావ్యం పద్దెనిమిది పేజీలే' అన్నారు. అది మొన్నటిమాట.

'నేటి మహాకావ్యం పద్దెనిమిది అక్షరాలే' అంటున్నారు కుర్రాళ్ళు.

***ఇది నేటిమాట!***

అలాగని భారత భాగవతాదులు చదవటం మానేస్తామని కాదు. నా బోటి రిటైరయిన వాళ్ళకి అవి చదివే తీరికుంటుంది.

నువ్వున్నావు.. అవి చదివే టైమెక్కడిది? ఉద్యోగంలో స్థిరపడి నాలుగురాళ్ళు సంపాయించుకుంటున్నావు గనక, అక్కడో పేజీ, ఇక్కడో పద్యం కాలక్షేపానికో – ఎవడి మొహాన్నైనా కొటేషను పడెయ్యటానికో చదవొచ్చు.

బండెడు పుస్తకాలు మోసుకుని కాన్వెంటు కెళ్తున్న కుర్రాళ్ళని చూస్తున్నాకదా! ఆ పుస్తకాలు చూస్తేనే గుండె గుభేల్మంటోంది.

నేను బియ్యేలో చూసిన లెక్కలు వాళ్ళు తొమ్మిదో తరగతిలోనే చేసి చూపిస్తున్నారు. లెక్కలంటే లెక్కలేకాదు. ప్రపంచజ్ఞానంలో కూడా మనకంటే పదిబారలు ముందుంటున్నారు.

ఒకడు డిస్కో అంటే మరోడు కుంగ్‌ఫూ అంటున్నాడు. అవేవిటో తెలుసుకోవాలంటే వాళ్ళ దగ్గరే ట్యూషన్ చదువుకోవాలి.

నీ వయసువాళ్ళు చక్కని చుక్కల దగ్గర ఫుల్‌స్టాప్‌లా నిలబడి పోతున్నారు. వీళ్ళు, –

చిచ్చరపిడుగులు. పదును తేరిన పలుగులు. చుక్కల లోకాన్ని దాటేసి ఏ దేశాలు ఏ గ్రహాల్ని పరిశోధిస్తున్నాయో తెలుసుకుని సైంటిఫిగ్గా ఆలోచిస్తున్నారు.

ఏ దేశాలు ఏయే దేశాల్ని ఉపగ్రహాలుగా చేసుకుని తమచుట్టూ తిప్పుకుంటున్నాయో, దానివల్ల ఆర్థిక విధానాలు రాత్రికి రాత్రి ఎలా మారిపోతున్నాయో చారిత్రకంగా, భౌగోళికంగా, ఆర్థికపరంగా సామాజికంగా అవగాహన చేసుకుంటున్నారు. ఏదో డెయిలీ పేపరు పట్టుకుని , వాళ్ళు రాసిందే చదువుకుని 'రెగనామిక్సు' మనకు తెలుసుగాని వంటింటో ఆడాళ్ళకేం తెలుసు... అనుకుంటున్న మన చేతులకి గాజులు తొడిగేసి, నోటికి తాళం వేసేస్తున్నారు కొందరు యువకులు.

చూశావా! నువ్వొచ్చిన వేళావిశేషం – నా ఆలోచనా విధానమే మారిపోయింది. 'టైమ్' లాంటి పత్రికలకి చందా కట్టెయ్. అప్పుడన్నా కాస్త వాళ్ళ అడుగుజాడల్లో తప్పటడుగులు వెయ్యిగలుగుతామేమో!

ఆచారాలు మారుతున్నాయి, అలవాట్లు మారుతున్నాయి, సంప్రదాయాలు మారుతున్నాయి. దేశాలు... దేశాలేవిటి గ్రహాలే దగ్గరయిపోతున్నప్పుడు గంటల పంచాంగాలే మారిపోతాయి.

ఈ మార్పులన్నీ చూసి లోకం తగలడిపోతోందనీ, కుర్రకారు పతనమై పోతోందనీ, ప్రాచీన భారతీయ సంస్కృతి సర్వనాశనమై పోతోందనీ వాపోతూ నెత్తీ నోరూ బాదుకుంటున్నారు కొందరు. జవహర్‌లాల్ నెహ్రూగారు 'డిస్కవరీ ఆఫ్ ఇండియా'లో ఈ విషయమే ప్రస్తావించారు. 'మన సంస్కృతి జీవస్రవంతిలాంటిది. ఎన్ని విదేశీ సంస్కృతులు ఉధృతంగా వచ్చి ఇందులో కలిసినా, తన తనం నిలబెట్టుకునే తత్వం మనకుంది'. అని ఛాందసుల్ని మందలించారు. విదేశాల మీద, వాళ్ళ వేషభాషల మీద మోజుపడే యువతరంది వెర్రితనమని వర్రీ కావద్దన్నారు. విశాలమైన ఆకాశంలో విహరించే వాళ్ళ స్వేచ్ఛను అపహరించవద్దన్నారు.

***మార్పు 'పతనం' కాదనీ, అందులో ఉండే మంచీ చెడూ –***

అనంతమైన కాలం, విశాలమైన విశ్వం నిర్ణయిస్తాయనీ భవభూతి అనుభూతితో చెప్పారు. అందుకే నెహ్రూగారు 'ప్రిన్స్ ఛార్మింగ్! డార్లింగాఫ్ మిలియన్స్' కాగలిగారు. ఆ ముక్క చెప్పి తిలక్ మన సంస్కృతి గురించి ఏవన్నాడో నాలుగు ముక్కలు చెబుతావిను.

'మన సంస్కృతి నశించిపోతోందన్న మన పెద్దల విచారానికి మనవాడు పిలకమాని క్రాఫింగ్ పెట్టుకున్నాడనేదే ఆధారం. మరణించిన అవ్వ నగలు మన కాలేజీ అమ్మాయి ఎంత పోరినా పెట్టుకోదు. మనగలిగినదీ, కాలానికి నిలబడగలిగినదీ వద్దన్నా పోదు. యుగయుగానికీ స్వభావం మారుతుంది. అగుపించని ప్రభావాలకి లొంగుతుంది. ఏ దేశసంస్కృతి అయినా ఏనాడూ కాదొక స్థిరబిందువు.

నైకనదీనదాలు అదృశ్యంగా కలసిన అంతస్సింధువు. '

నెహ్రూగారి భావాన్నే ఎంత అద్భుతంగా చెప్పాడో చూశావా!


ఇంతింత మాటలు చెబుతున్నానని కంగారుపడి గది ఖాళీ చేసి వెళ్ళిపోకు. స్థిమితంగా ఆలోచిస్తే నీకే అరుగుదల అవుతుంది.

అవునూ! ఇవాళ పెందరాళే ఆకలేస్తోంది. మీ పిన్నేమో వంటింటోంచి తెవిలేట్టులేదు. నీకోసం గుత్తి వంకాయకూర, పప్పు పులుసు ప్రత్యేకంగా చేస్తున్నట్టుంది.

సుష్టుగా భోంచెయ్. ఘట్టుగా నిద్రపడుతుంది.

అమృతం కురిసిన రాత్రేననుకో!



8

**పండు వెన్నెల్లో పక్కేసుకుని** నిండుచందమామని చూడకుండా - మంచం మీద బోర్లాపడుకుని నేలమీద గీతలు గీస్తున్నావేవిటోయ్! చంద్రముఖి గుర్తొస్తుందని పైకి చూడ్డం లేదా? లేక గుత్తివంకాయకూర గుర్తుచేసుకుంటూ ఇంకా గుటకలేస్తున్నావా?

పంకజముఖి ఎంత గొప్పదో - వంకాయ కూర కూడా అంత గొప్పదేననుకో! మళ్ళీ చేసిపెడుతుందిలే మీ పిన్ని -

వంకాయకూర ఎన్ని రకాలుగా చెయ్యొచ్చో అన్నిట్లోనూ మీ పిన్ని గొప్ప ఎక్స్‌పర్ట్! ఆ మధ్యనో వంటకాల రచయిత్రి ఈవిణ్ణి కన్సల్ట్ చెయ్యడానికొచ్చింది.

***<u>మీ పిన్ని అంత తేలిగ్గా లొంగుతుందా?</u>***

నవ్వమంటే నవ్వేది నవ్వుకాదు

ఇవ్వమంటే ఇచ్చేది మనసు కాదు

నేర్చుకుంటే వచ్చేది వంటకాదు అన్నట్టు కావలిస్తే ఇంటర్వ్యూ రాసుకుని పొమ్మంది.

డాక్టర్ల గురించి చెప్పుకునేప్పుడు హస్తవాసి అంటాం చూడు. అల్లాగే వంట కూడా హస్తవాసి మీదే ఆధారపడి ఉంటుంది.

వంటలు పిండివంటలు పుస్తకం ఎడం చేత్తో పట్టుకుని కుడిచేత్తో ప్రాక్టీస్ చేస్తే - చేసింది కుడిత్తొట్లోక్కూడా పనికిరాదు.

మరీ.. తూర్పుగోదావరి జిల్లా వాళ్ళున్నారే - వాళ్ళ మాటతీరులో ఎన్ని అర్థాలుంటాయో పదార్థాల్లో కూడా అన్ని రుచులుంటాయి. నాలుగయిదు రకాల ఆవకాయలు పెట్టటం వాళ్ళకే చెల్లు!

***<u>పాకకళ సామాన్యం కాదు</u>***

అరవై నాలుగు కళల్లో అది కూడా ఒకటి. నలభీమపాకం అని మగాళ్ళకి పేరొచ్చింది గాని అది పేరుకి మాత్రమే!

జబ్బపుష్టితో నవలలు వండిపడేసే వాళ్ళలాంటివాడు కాబట్టి భీముడికీ, జబ్బుదృష్టితో - మరి దేనికో పనికిరాక బాహుకుడైన నలుడికీ ఆ పేరు ప్రతిష్ఠలు దక్కాయని నా అనుమానం.

ఇందాక ఒక జిల్లాకి పెద్దరికమిచ్చి మిగతా జిల్లాలకి మంత్రివర్గంలో స్థానం లేనట్లు కించపరచాననుకోకు. ఒకో ప్రాంతాన ఒకో వస్తువు ప్రసిద్ధికెక్కుతుంది. అనకాపల్లి బెల్లం, కోనసీమ కొబ్బరి, గుంటూరు గోంగూర, పెదవడ్లపూడి నారింజ - అని వాటికలా పేర్లొచ్చేశాయి. ఇప్పుడా వస్తువులకి అక్కడ పాతకాలం రుచి ఉండకపోవచ్చు. కానీ పేరు మాత్రం పోదు. ఇంటిపేరులాగా టంకం వేసినట్లు అతుక్కుపోతుంది. 'ఎస్సార్ వేపా' అని పేరు కుదించుకోవచ్చు. కాని 'వేపా' వారనే ఇంటిపేరు పోదు కదా!

ఒకొక్కరికి అనుకోకుండా, అప్రయత్నంగా మంచిపేరొచ్చేస్తుంది. నాకు 'మితభాషి' అని పేరొచ్చినట్లు. కొందరికి అదేం కర్మమో - గుణానికి అతకని పేరొస్తుంది. పోతనగారికి 'భక్త' అన్నది ఇంటి పేరంత గొప్పగా అతుక్కుపోయింది. శ్రీనాథుడి పేరు ముందు 'శృంగార' అన్నది గుచ్చుకుపోయింది.

నిజానికి భక్తపోతనలో శృంగారం పాలెక్కువ. శృంగార శ్రీనాథుడిలో భక్తిరసం ఎక్కువ.

బలిచక్రవర్తి కథలో వామనుడు దానం అడగటానికొస్తాడు.

వచ్చినవాడు విష్ణుమూర్తి - జాగర్త అని హెచ్చరిస్తాడు శుక్రాచార్యుడు.

ఆయనే విష్ణువైతే శ్రీపతికి దానం ఇవ్వటం కన్నా అదృష్టం ఏవిటంటాడు బలి.

నాది పై చేయి కావటం 'ఆదినే శ్రీపతి కొప్పుపై'... వగైరా వగైరా సమస్తాంగాల మీదా పడిన వాడి చెయ్యి కింద కావటం గొప్ప కాదా అనిపిస్తాడు.

***<u>పోతనగారికి సరస్వతీదేవి ఏడుస్తూ కనబడిందిట!</u>***

'కాటుక కంటినీరు చనుకట్టుపయిన్' పడేలా ఏడవకూడదమ్మా అంటూ ఆవిడ కన్నీరు తుడుస్తాడు. కంటినీరు అక్కడే పడనేల? కవిగారి కన్ను చనుకట్టు చుట్టూ తిరగనేల అయినా ఆయన భక్తపోతనే!

శ్రీనాథుడు శృంగారంతో పద్యం మొదలెట్టి, చివరికి శివభక్తి రంగరించి సింగారిస్తాడు. 'కస్తూరికా భిక్షాదానము చెయ్యమ'ని ఓ తెలుగు రాజును కోరాడు. ఆ కస్తూరి దక్షారామ భీమేశ్వరాలయంలో నాట్యం చేసే దేవదాసీ జనాల వక్షోజాల మీద పరిమళిస్తుందంటాడు. కస్తూరి తనకోసం కాదట! శివార్చన కోసం ఉపయోగిస్తాట్ట! అంత అందంగా భక్తిని ధ్వనించినా ఆయనకి శృంగార శ్రీనాథుడనే అల్లరి తప్పలేదు పాపం!

అల్లాగే - నువ్వు ఆఫీసుకి తలొంచుకునెళ్ళి తలొంచుకు తిరిగొస్తావు. కానీ గిట్టనివాళ్ళు మరోరకంగా ప్రచారం చేస్తారు 'మనవాడు ఆడాళ్ళ కాళ్ళకి మట్టెలున్నాయా లేదాని ముందు చూస్తాడు గురూ! ఆ తరువాత ప్రొసీడవుతాడు' అంటారు. ఎందుకనీ.. నీ వయసలాంటిది గనక!

వంకాయకూర దగ్గర మొదలెట్టి వారిజాక్షుల దాకా వచ్చేశాం!

వాతావరణం అలా ఉంది మరి..

జిల్లాలవారి పదార్థాల్లాగే పదార్థాలు కూడా నువ్వు తెలుసుకుంటం మంచిది. ఒక జిల్లా వాళ్ళు గేద అంటే మరో జిల్లా వాళ్ళు బర్రె అంటారు. ఒకరు బాల్చీ, చేద అంటే మరొకరు బకెట్టు, బొక్కెన అంటారు. మనం 'దువ్వెన' అంటామా! విశాఖ పట్నం పైవాళ్ళు 'పన్ని' అంటారు. మనకూ ఆ పదం ఉందనుకో! ఆడాళ్ళు ఈరు తీసుకునే దువ్వెనని 'ఈర్పన్ని, ఈర్పెన' అంటారు. ఒకరు 'చిన్నది', 'పిల్లది' అంటే మరొకరు 'గుంట' అంటారు.

ఉద్యోగరీత్యా నాలుగు జిలాలు తిరిగేవాడివి - ఇలాంటివి తెలుసుకునుంటం మంచిది!

కృష్ణాజిల్లాలో 'గుంట బావుంది' అన్నావనుకో సెన్సారు వాళ్ళలాగా కత్తెరతో వదిలిపెట్టరు. కత్తులూ, బరిసెల్దాకా వెళ్ళిపోయి క్లైమాక్సులో 'వయులెన్స్' పెరిగిపోతుంది.

అద్భుతంగా పొగిడేస్తున్నామన్న ఆనందంలో 'కీర్తిశేషులైన మంత్రిగారిప్పుడు మనకి సందేశమిస్తారు' అన్నావనుకో - కొంప మునిగిందన్నమాటే - ఆ మాట ఆయనకి బోధపడితే నీకు శ్రద్ధాంజలే! ఉద్యోగానికి తిలోదకాలే!

కథలన్నీ కంచికి చేరినట్టు పదాలన్నీ ఒకే అర్ధమిచ్చినా చచ్చిన దివంగతులయారు, స్వర్గస్థులయారు, లింగైక్యం చెందారు, పరమపదించారు అంటూ రకరకాల పదాలు నేర్చుకోవాలి. సభలోంచి మధ్యలో వెళ్ళిపోయిన అధ్యక్షులవారి గురించి 'వారిప్పుడు మన మధ్యలేరు' అనకూడదు.


అదే తూర్పుగోదావరి జిల్లాలో....

'ఏవిటీ... బోర్లాపడుకుని వింటున్నావనుకున్నాను. గురక పెట్టేస్తున్నావా?

'నిద్రపోతున్నాను' అని చెప్పి పడుకోవచ్చుగా!

మీ పిన్నే నయం.. నిద్దరోతున్నా ఊ కొట్టేది, - అది మూలుగో మరోటో తెలీకుండా!



9

**కొత్త చోటయినా నీకు బాగానే నిద్రపట్టినట్టుందే!** తెల్లారి లేచి చూసేసరికి వాకిట్లో పక్క గదిలోకి మార్చేశావ్. సూర్యకిరణాలు కళ్ళలో అలారం కొట్టుంటాయి.

నాకయితే కొత్త చోట కలత నిద్రే కానీ, కమ్మటి నిద్ర పట్టదు.

పెళ్ళయిన తరువాత మూణ్ణిద్దర్లప్పుడు కంటిక్కునుకు పడితే ఒట్టు!

అవటానికి మేనమావ ఇల్లే అయినా మనం వెళ్ళిందెప్పుడు? కాస్త కునుకుపడితే మీ పిన్ని చెడగొట్టేసేది.

మూణ్ణిద్దర్లప్పుడు నిద్రెందుకని ముసిముసి నవ్వుల్నవ్వకు.

ఆ అవసరమేవిటో. బడలిక తీర్చుకుని ఒళ్ళు రవ్వంత తేలిక చేసుకోటంలో ఉన్న సుఖమేమిటో ముందు ముందు నీకే తెలుస్తుంది. అప్పుడు నవ్వుతావో, ఏం చేస్తావో నే చూడనా!?

కానీ కొత్తచోట కూడా ఇంత మత్తుగా పడుకునే అలవాటు చేసుకోటం శరీరానికంత మంచిదికాదు.

అత్తారింట్లో ఆడాళ్ళు గుసగుసలుపోతారు. రాత్రి ఎన్నింటికి నిద్దరోయావో ఆరాలు తీస్తారు. ఆవలించకుండానే పేగుల్లెక్కేట్టేస్తారు. వాళ్ళ పెళ్ళినాటి ముచ్చట్లు గుర్తుచేసుకోటానికి అదో అవకాశం. మధురస్మృతులు నెమరువేసుకోవటానికో, చేదు చేతలు చెరిపేసుకోటానికో అలాంటివి కల్పించారు మనవాళ్ళు.

నువ్వూ మనవాళ్ళలో ఒకడివైపోయావు గనక గదిలో అలికిడి వినబడి పలకరించి పోదామనొచ్చాను.

మీ పిన్ని నువ్వెప్పుడు నిద్దర్లేస్తావోనని మూడుసార్లు కాఫీ వెచ్చబట్టింది. బాగా మరిగిపోయింది కాబోలు, రుచిలేని కాఫీ నీకివ్వటం ఇష్టంగా కనబడక, పారబొయ్యటం, పనిమనిషికి ఇవ్వటం కష్టంగా కనిపిస్తుంది కనక - తనే గొంతులో పోసుకున్నట్టుంది.

మళ్ళీ ఫిల్టరేసింది... ఇంతకూ నీకు ఇచ్చిందా లేదా?

ఇవ్వబట్టే గదా అయిదు నిమిషాల్లో గెడ్డం గీసి, స్నానం చేసి ఆఫీసుకి రెడీ కాగలిగావు.

మన్లోమాట. కొంచెం దగ్గరకి రా!

చనువున్న కుర్రాడివి గదాని సాయంత్రం వచ్చేప్పుడు కూరగాయలూ అవీ తెమ్మని ఇప్పుడే బుట్ట చేతికిస్తుంది.

మొహమాటానికి ఓ మాటు తెచ్చావో అదే అలవాటు చేస్తుంది.

కూరగాయలు చచ్చూపుచ్చూ చూడ్డం, బేరంసారం చెయ్యడం, అవసరం మేరకే పొదుపుగా కొని సంసారం చెయ్యడం ఇప్పణ్ణించీ నేర్చుకోమని ఓ లెక్చరిస్తుంది.

కాస్త ఖాళీగా ఉన్నట్టు కనబడితే - పందిరిగుంజకు పన్జెప్పేరకం. ఇలాటివన్నీ పడున్నాను కాబట్టి ముందు జాగర్త కోసం చెబుతున్నాను. ఆఫీసు నుంచొచ్చాక గోళ్ళు గిల్లుకుంటూ కూచున్నావనుకో - బంగాళాదుంప చెక్కు తియ్యమనో, బఠాణీలు వొల్చిపెట్టమనో పనప్పజెబుతుంది. కాపరానికొచ్చిన కొత్తలో నాతోనూ ఇలాటిపన్లు చేయించటానికి ప్రయత్నించింది. కాస్త దూరం ఆలోచించి అర్జంటు ఫైల్సు నాలుగు ముందేసుక్కూచునే వాణ్ణి!

అప్పణ్ణించీ ఆ ప్రయత్నం విరమించింది. ఇప్పుడు తప్పటం లేదనుకుకో! అయినా మార్కెట్టుకి మాత్రం నన్ను పంపదు. పంపితే వొచ్చే నష్టాలు రేపోమాపో నీకు ఏకరువు పెట్టి నిన్ను పంపిస్తుందనేదే నా బాధ. అదో బరువా అన్నట్టు నవ్వుతున్నావ్!

బరువు బాధ్యతగా మారి - ఆనక అందులో తప్పొప్పులు, తకరార్లు వస్తాయి. ఆఫీసులో ఓవర్ టైమని చెప్పి ఏడింటిదాకా ఇంటికి రాకు. ఏ అయిదింటికో నేనే మీ ఆఫీసుకొస్తాను. పార్కులోనో, బజార్లోనో కాలక్షేపం చేసి భోజనం వేళకి ఇంటికి చేరదాం.

నలుగుర్నీ చూసినట్టూ ఉంటుంది. నీలాటి కుర్రాడితో కలిసి తిరగటం వల్ల నా వయసు వాళ్ళకి కాస్త అసూయ కలిగించి ఆనందించినట్టూ ఉంటుంది.

***<u>అసలు విషయం మరిచిపోయా!</u>***

ఈ ఆదివారం మీ ఊరెళ్ళు. మీ అమ్మగారికి నాన్నగారికి నేను చెప్పానని చెప్పి నాలుగురోజులుండెళ్ళమని నచ్చచెప్పు. పల్లెటూళ్ళో ఉండి పైరగాలికి అలవాటు పడినవాళ్ళకి ఈ పొగగొట్టాల వాసన గిట్టదనుకో! అయినా తీసుకురావటం నీ బాధ్యత. అడిగి కాదనిపించుకున్నా అదో అందం. మీ పిన్ని చెప్పనే చెప్పిందిగా, మీ వాళ్ళొస్తే శుచీ శుభ్రతకి ఇక్కడేం లోపం ఉండదని. అధిష్టానవర్గం ఆ మాత్రం పూచీ ఇస్తే మనం మరికాస్త చొరవ తీసుకోవాలి. ఏవంటావ్?

ఒస్తూ ఒస్తూ బందరులడ్డూ ఎలాగూ తెస్తావనుకో. వాటితోపాటు ఆ కాకరకాయలని - నువ్వు చిన్నప్పుడు తినుంటావులే - పొలం గట్లమీద బళ్ళకొద్దీ కాస్తాయి. మీ నాన్నతో ఒక్క ముక్క చెబితే బస్తాల కొద్దీ పంపిస్తారు. ఇక్కడ అసలు దొరకవు. దొరికినా - కిలో ధరెంతో తెలుసా.. వొద్దులే. తెలుసుకుని తింటే రూపాయలు గుర్తొచ్చి వాటి రుచి తగ్గుతుంది. నువ్వు ఆఫీసు కెళ్తుంటే రికామీగా కూచోకుండా నాకూ ఏదైనా చెయ్యాలని ఉత్సాహం కలుగుతోంది.

అందుకే - మీ నాన్నగార్ని నాల్రోజులుండేలా రమ్మంటున్నాను.

ఓ వయసువాళ్ళం!

ఆలోచనలూ ఒకలాగే ఉంటాయి.

మనమనుకున్న సైడు బిజినెస్సు సంగతో, లేదా - ఇక్కడో ఎక్కడో నీకో స్థలం ఏర్పాటు చెయ్యటం గురించో, అవీ కాకపోతే సమ్మంధాల గురించో మాటాడుకుంటాం. మా పని మాటాడుకోటం వరకే! నిర్ణయాలు నీవే!

దిగుల్లేకుండా నెల గడిచిపోతోంది అన్న సంతోషం తప్ప ముందాలోచన లేదు నీకు.

ఇప్పుడు గజం అయిదురూపాయల చొప్పున ఓ వెయ్యిగజాలు కొనిపడేశావనుకో - నువు ఎన్ని ఊళ్ళు మారినా, అది ట్రాన్స్‌ఫరవదు కదా?

పదేళ్ళయేటప్పటికి గజాలు ఫర్లాంగుల్లెక్కన పెరిగిపోతాయి. అయిదుక్కొన్నది అయిదొందలు పలుకుతుంది. మొన్న పేపర్లో చూళ్ళేదా. మరో నూట అరవయ్యేళ్ళకి మన దేశ జనాభా నూట డెబ్బయి కోట్లకి పెరుగుతుందట! అలాగని ప్రపంచబ్యాంకువారు వాషింగ్టన్‌లో ఓ నివేదిక తయారుచేశారు. ఆ లెక్కన అప్పటికి ప్రపంచ జనాభా పదకొండు వందల కోట్లకి చేరుకుంటుందట! అప్పుడు మనిషికొక్కింటికి అరగజం ఆరొందల్రూపాయల్చొప్పున పడుతుంది. అందుకే అంతరిక్షంలో ఇప్పుడే చవగ్గా స్థలాలు పట్టుకుని, దేశాలు కట్టుకుని, జెండాలు పెట్టుకోవాలనుకుంటున్నారు అమెరికావారు, రష్యావారు. వాళ్ళలో పాయింటు పాయింటు ఒకటో వంతయినా మనం తొందరపడద్దూ!

అబ్బా!

నేను చెప్పినదంతా గాలికెగిరిపోయింది. స్థలం సంగతీ, బందరులడ్డూ సంగతీ కాదయ్యా. ఆఫీసుకెళ్ళే ముందు 'నీట్'గా ఉన్నానా లేదా అని ఒకటికి పదిసార్లు నిలువుటద్దంలో చూసుకోవాలి. మొగలిపూల జడేసుకున్న ఆడది ముందో అద్దం, వెనకో అద్దం పెట్టుకుని మురిసిపోతుంది చూడు.. అల్లాగ!


వెనకద్దంలా నేనుపయోగపడతాననుకో - కాలరు సరిచూసుకో క్రాపు సరిచూసుకో - మొగాళ్ళు మూర్ఛపోయేట్టుండాలోయ్!

అసలే అందగాడివి - నీకు నేన్చెప్పేదేవిటి గాని, -

కేవలం మళ్ళా గుర్తు చేస్తున్నానంతే!

కొత్త చోటయినా సొంతిల్లులా బిహేవ్ చెయ్! అదే నాక్కావలసిందీ, మీ పిన్ని కోరుకునేదీ!



10

**నాకు తోచిన ముక్క చెప్పాను.** ఆ మీదట నీ ఇష్టం! కుర్రకారు వేడినెత్తురు మీదుంటారు. నాకు తెలీదా? నీ వయసులో నేను అనుకున్నాను. "ఎర్రగా బుర్రగా ముట్టుకుంటే కందిపోయే టొమేటో పండులా, పట్టుకుంటే వంగిపోయే జాజితీగలా ఉండే పెళ్ళాం రావాల "ని.

మా నాన్న మరోలా అనుకున్నాడు.

ఒక్కతే కూతురు, మగసంతు మరికలక్కూడదు, పాతికెకరాల మాగాణీ, కనీసం పదెకరాల మెట్టా ఉన్నవాడే తనకు వియ్యంకుడు కావాలని.

రెండూ జరగలేదనుకో -

అంచాత, పెళ్ళిచూపులకెళ్ళినప్పుడు పదిమంది స్నేహితుల్ని వెంటపెట్టుకెళ్ళకూడదు.

ఒహడికి ఇగురిష్టం. మరొహడికి పులుసు ఇష్టం. ఇంకొకడికి కోడిష్టం, లేకపోతే అది పెట్టే గుడ్లిష్టం.

నువ్వో పక్క కానీ కట్నం ఒద్దంటున్నావాయె - ఆడపెళ్ళివారికెలా ఉంటుంది? ఆ మాటకే పెళ్ళి చేసేసినంత సంబరం.

ఏదేనా తభావతొచ్చిందా.. ఆ కుర్రాడికి ఇంగితజ్ఞానం లేదని ప్రచారం మొదలెడతారు. కల్యాణాల కార్ఖానాల వాళ్ళు ప్రతాదివారం మీటింగులు కూడా పెడతార్ట.

పెళ్ళిచూపులకెళ్ళి తలతిక్కగా మాట్లాడినవాళ్ళ గుట్టుమట్లన్నీ గుప్పెట్లో పెట్టుకుని, ఆనక మార్కెట్లో వదిలేస్తార్ట.

ఇహ చూస్కో...

నిప్పులేందే పొగరాదనే పొగచూరిన సామెత ఒకడు చెబితే.. 'నిజమే! ఆ కుర్రాడికదివరకే ఒక పెళ్ళయి విడాకులిచ్చాడనో, పుట్టింటికి తన్ని తగిలేశాడనో, కట్నం డబ్బివ్వలేదని కిరసనాయిల్ పోసి తగలేశాడనో..' రోజూ ఇలాంటి వార్తలు ఎన్ని చూడ్డంలేదు పేపర్లో.

నువ్వలాంటి వాడివి కాదనీ, బుద్ధిమంతుడివనీ, కట్నం పుచ్చుకోననటానిక్కారణం సంజయ్‌గాంధీ టైంలో 'కట్నపిశాచం పోవాలి' అని రక్తాక్షరాలతో సంతకం చెయ్యడమేననీ నాకు తెలుసు.

ఏం లాభం?

సూచనగా మీ పిన్నితో ఆ మాటే అన్నాను.

"కుర్రాళ్ళలాగే అంటారు. మా తమ్ముడు తన కూతురికి లోటు చేస్తాడా? కట్నాలూ, లాంఛనాలూ అవో ముచ్చట్లు" అంది.

నేనవన్నీ నీకు చెప్పానా?

లేదు.

ఎందుకు లేదూ..

అలా చెబితే నువ్వు పిల్లని చూడ్డానిక్కూడా వెళ్ళనంటావని నాకు తెలుసుగనక చెప్పలేదు.

నీక్కోపమొచ్చినా సరే, ఓ ముక్క చెబుతావిను.

'డౌరీ' అన్న పదం డిక్షనరీలోంచి తుడిచెయ్.. అయినా అదిపోదు.

ఎందువల్ల,-

పుచ్చుకునే వాళ్ళకంటే రేటుపెంచి ఇచ్చేవాళ్ళలో పోటీ పెరిగిపోయింది. సరే, అయిందేదో అయిపోయింది.

అడ్రసిచ్చాను గదాని ఆఫీసుకి సెలవపెట్టి నాక్కూడా చెప్పకుండా వెళ్ళిపిల్లని చూసొచ్చావు.

పిల్లనచ్చలేదు.

ఆ ముక్క చెబితే మీ పిన్ని కాస్త మనసు కష్టపెట్టుకుంటుంది. కానీ, దాని కోపం తాటాకు మంట. నలబయ్యేళ్ళమట్టీ కాపురం చేస్తున్న నాకు తెలుసు. ఈ పూటకి నీతో మాటాడకపోయినా, రేపు నువ్వు ఇంటికి రాకపోతే బెంగపెట్టేసుకుంటుంది.

'ఆ కుర్రాడు రాకపోతే సందడే లేదంటుంది. ఈకాలం కుర్రాళ్ళలో తప్పు పుట్టాడండీ అంటుంది. ఆ వినయం, వందనం, సంప్రదాయం పాటించటం అంతా మీరే గుర్తొస్తున్నా'రని నాకు సర్టిఫికెటు పారేస్తుంది.

అంచాత, సంబంధం కుదర్లేదని మనసులో ఏం పెట్టుకోకుండా మామూలుగా వస్తుండు.

మీ పిన్నికి ఆరుగురన్నదమ్ములు.

కొంచెం ఉండు, -


పోపు మాడువాసనొస్తున్నట్టు లేదూ?

మీ పిన్ని తలంటు స్నానం చేస్తున్నట్లుంది. వెళ్ళి చూసొస్తా!



# అధికప్రసంగం

– ఎమ్వీ్వ.ఎల్



11

**అదేవిటలా తోటకూర కాడలా వేళ్ళాడిపోతున్నావ్!**

ఆఫీసులో పనెక్కువగా ఉందా? ఆఫీసరేవన్నా అక్షింతలేశాడా?

ఏదీకాక, చెప్పిన సైడు బిజినెస్సు గురించి నిద్దర్లేకుండా ఆలోచించి బుర్ర చెడగొట్టుకున్నావా?

అబ్బే.. పాతికేళ్ళ కుర్రాడుండాల్సిన పద్ధతి కాదోయ్ ఇది. పెళ్ళయ్యేదాకా టిప్‌టాప్‌గానే ఉండాలి.

మా స్నేహితుడి కొడుకుని చూడ్డానికి ఇంటిమేషనివ్వకుండా ఆడపిల్ల తాలుకు వాళ్ళొచ్చారు. ఆ టైంకి మనవాడు రమ్మీ ఆడుతూ మాంచి రంజులో ఉన్నాడు. చూశారు. వెళ్ళారు. అంతే!

అప్పటిదాకా మార్కెట్లో లక్షదాకా పలికిన ధర సగానికి సగం పడిపోయింది.

నువ్ రేసు కోర్సుకి సరదాగానే వెళ్ళావు. పదిరూపాయలూ సరదాగానే కట్టావు. దినఫలం బావుండి వందొచ్చింది. అది విన్నవాడికేం ఒరిగింది.

లోపల్లోపల కుళ్ళికుళ్ళి ఏడుస్తాడు. తన కడుపుమంటని మరోరకంగా తీర్చుకుంటాడు. వాడికెలా పెళ్ళవుతుందో నేనూ చూస్తానని మనసులో ప్రతిజ్ఞ కూడా చేసుకుంటాడు.

సరే వదిలెయ్!

సైడు బిజినెస్సు గురించి తీవ్రంగా ఆలోచిస్తూ ఇలా అయిపోయావా – ఆలోచించాల్సిందే. కానీ నింపాదిగా, తొట్రుపాటు లేకుండా, తప్పటడుగు పడకుండా ఆలోచించు.

చెప్పానుగా – బిజినెస్ విషయంలో ఎవర్నీ నమ్మొద్దని.

చివరికి నన్నయినా సరే! ఇహ రెండో విషయం –

ఆఫీసరు అక్షింతలేస్తే ఆశీస్సులుగా భావించాలి. దిగాలు పడిపోకూడదు 'నన్నింత మాటంటాడా' అని పౌరుషం తెచ్చుకోకూడదు.

ఆ మాటలు పట్టించుకుని మనసు పాడుచేసుకున్నావా - ఇహ రోజూ పాడైపోతూనే ఉంటుంది వెధవమనసు.

ఆత్రేయగారు కాదూ ఆ విలువైన ముక్క చెప్పింది -

"మనసుగతి ఇంతే, మనిషి బ్రతుకింతే

మనసున్న మనిషికి సుఖము లేదంతే" నిజం కూడా అంతే!

కొన్ని విషయాల్లో మనసుని కూకలేసి, అవతలకి తోసేసి మనపని మనం చేసుకుంటూ పోవాలి. లేకపోతే బతకలేం.

ఇది జీవిత సత్యం. నలభయ్యేళ్ళు కాచి వడబోసిన అనుభవసారం.

ఈ ఆఫీసర్లున్నారే.. వాళ్ళకెప్పుడు కోపమొస్తుందో, ఎప్పుడు ప్రేమొస్తుందో చెప్పలేం - ఆఫీసరు కూడా మనిషేకదా!

పీత కష్టాలు పీతకున్నట్లు, వాడి కష్టాలు వాడికీ ఉంటాయి.

నీకు అక్షింతలు పడటానికి లక్షరకాల కారణాలు.

ఇంక ఆఫీసుపనంటావా... చేసేవాడికి చేసిన కొద్దీ పెరుగుతుందేకానీ తగ్గదు. నీ పని పూర్తి చేసుకుని కాస్త 'రిలాక్స'య్యావా -

నీ ఫ్రెండే నీ దగ్గరకొచ్చి 'కాస్తీ స్టేట్‌మెంట్ రాసిపెట్టు గురూ' అని మొహమాట పెట్టేస్తాడు. తను మాత్రం కాఫీ తాగటానికి కాంటినుకెళ్ళిపోతాడు.

అదే టెక్నిక్కు నువ్వుపయోగించి చూడు -

కాఫీ తెప్పించి ఫిఫ్టీ ఫిఫ్టీ అను.

వాడి అభిమాన హీరో సినిమాకి నీకిష్టం లేకపోయినా ఓటి రెండుసార్లు నీ ఖర్చుతో తీసుకెళ్ళు.

నీకు 'దాసోహం' అంటాడు. అప్పుడు నీ పని వాడి మొహాన పడేసి కాఫీ తాగటానికి కాంటినుకెళ్ళిపోవచ్చు.

పని బాగా పేరుకుపోయి, అన్నీ అర్జంటు ఫైల్సే అయి డేంజరులైటులా కనబడిందనుకో - అయిదుగంటలు కొట్టినా సీట్లోంచి కదలకు. ఏడింటిదాకా పన్జెయ్యి.

నీమీద ఆఫీసరుకి అమితాభిమానం పుట్టుకొస్తుంది.

మిగతావాళ్ళని పిలిచి మీటింగెట్టి నిన్ను చూపించి బుద్ధితెచ్చుకోండోయ్ అని వాళ్ళని దులిపేస్తాడు.

ఆఫీసరు గుడ్‌లుక్స్‌లో నువ్వున్నావని తెలిసిపోతుంది కాబట్టి, నువ్వు చెయ్యాల్సిన పనిని వాటాలేసుకుని మరీ వాళ్ళే చేసేస్తారు. ఇలాంటి కిటుకులు కొన్ని చూసి తెలుసుకోవాలి. కొన్ని నాలాంటి వాళ్ళనడిగి నేర్చుకోవాలి.

అంతేగానీ -

ఇలా తోటకూర.. అన్నట్టు గ్యాపకమొచ్చింది. రేపొచ్చేప్పుడు బజార్లో నవనవలాడే తోటకారకాడలు కనబడితే -

కనబడతాయిలే - కొనుక్కురా.

మీ పిన్నికి చాలా ఇష్టం!

ఆవిడ గుడ్‌లుక్స్‌లో కూడా ఉంటం మంచిది కదా!




12

**పేకాడ్డం వ్యసనమంటారు కానీ, నేనొప్పుకోను.**

అదో ఓ గొప్ప ఎడ్యుకేషన్! అదీ గొప్ప ఆర్టే!

ప్రపంచ జ్ఞానం పేకాడ్డంలో సంపాయించొచ్చు. పెద్దవాడినైన నేను నీలాంటి కుర్రాడికిలాంటి మాటలు చెప్పకూడదని కొందరంటే అనుకోనీ. నా నిశ్చితాభిప్రాయం ఇది.

నాలాగా తక్కువ మాట్లాడకపోవటం వల్ల ఎంత ఎనర్జీ కలిసొస్తుంది. వినోబాబావేగారు భూదానోద్యమంలో దేశమంతా కాలినడకన తిరిగినా అన్నాళ్ళెలా బతికున్నారంటావ్?

కేవలం మౌనవ్రతం వల్ల.

నాకిన్నేళ్ళొచ్చినా జలుబూ, జ్వరం, బిళ్ళలూ, సూదులూ ఎరక్కుండా ఇంత గట్టిగా ఎలా ఉండగలిగానంటావ్?

అతిమిత భాషిని కావటంవల్ల.

అదో పాయింటు,

పేకాడే వాళ్ళ తీరుబట్టి వాళ్ళ తత్వం పట్టెయ్యొచ్చు. వాడు పొదుపరో, కాదో ఆట ఆడటంలో డ్రాప్ చెయ్యడంలో తెలిసిపోతుంది. ముక్కలు పట్టుకున్నప్పుడు కొందరి చేతులు వణుకుతాయి. కొందరి మొహాలు వెలుగుతాయి. కొందరివి కొడిగట్టిపోతాయి. దాన్ని బట్టి ఆల్ కౌంటో, డీల్‌షోనో కనిపెట్టెయ్యొచ్చు. అలాంటప్పుడు బి.పి. ఆపరేటర్ కూడా వాళ్ళని కరెక్ట్‌గా స్టడీ చెయ్యలేరు. మా పెద్దాళ్ళకాలంలో ఎవడన్నా అప్పడగడానికి వచ్చాడనుకో - వరండాలో పడక్కుర్చీలో జారగిలబడి తాపీగా చుట్టకాలుస్తూ 'ముందు కాళ్ళు కడుక్కోవయ్యా మగడా ఆనక తీరిగ్గా మాటాడుకుందాం' అనేవాడు మా తాత వాకిట్లో ఉన్న గంగాళం, చెంబూ చూపిస్తూ, చుట్ట కాలుస్తూనే మా ముసలాయన అన్నీ ఓ కంట గమనించేవాడు.

తెలీనివాళ్ళు చుట్టపొగ పీల్చే ఆనందంలో అర్ధనిమీలిత నేత్రుడై ఉన్నాడని భ్రమపడేవారు.

నీళ్ళు దిమ్మరించేసుకున్నవాడు వడ్డీ ఎంత చెప్పినా సిద్ధపడి 'అసలు'కి ఎసరు పెట్టే బాపతు.

పొదుపుగా కాళ్ళు కడుక్కున్నవాడు అన్నమాట మీద నిలబడి అప్పు జమచేసే రకం.

ఇలా టెస్టులు పెట్టి అప్పులిచ్చి ఆస్తులు పెంచాడు మాతాత.

ఆ లక్షణాలబ్బని మా అబ్బ, అడ్డమైన వాడికీ అప్పులిచ్చి, హామీలుండి ఆస్తికాస్తా కరారావడి చుట్టేశాడు.

పేకాట్లో కూడా టేబుల్ దగ్గర ఎవడికి అప్పెట్టొచ్చో, ఎవడిక్కూడదో కనిపెట్టగలిగాలి.

ఈ విషయాలు నీకు ఎన్సైక్లోపీడియా ఆఫ్ బ్రిటానికా చదివినా పట్టుబడవు.

అందుకే పేకాట ఓ పెద్ద ఎడ్యుకేషన్!

ఇవన్నీ నువ్వెక్కడ నేర్చుకున్నావ్ బాబాయ్ అంటావేమో!

క్లబ్బులోనే, -

నా డబ్బుతో నే ఛస్తే ఆడేవాణ్ణికాదు.

నాది విన్నింగ్ హాండ్ అని గుర్తున్నవాళ్ళకి ఆడిపెట్టేవాణ్ణి.

ఆడేది మన సొమ్ముతో కాదు కాబట్టి ఇవన్నీ స్టడీచేసేవాణ్ణి.

ఆ స్టడీలేనివాళ్ళు డబ్బు పోయినకొద్దీ పేట్రేగిపోయి ధర్మరాజు లెవెల్లోకెళ్ళిపోతారు. దాన్నే కంట్రోలు తప్పటం అంటారు ఒకసారి తప్పిందా... కన్నెపిల్ల నెల తప్పినట్లే. ఏలిన్నాటిశని నలమహారాజుని ఏడిపించినట్లు ఎక్స్టెన్షన్ ముక్కరాక ఎకరాలమ్మించేస్తుంది.

అందుకే అదో గొప్ప ఆర్టు అన్నాన్నేను. పెళ్ళయిన కొత్తలో మూణ్ణిద్దర్లప్పుడే మీ పిన్నికి నేర్పాన్నేను.

నేను కావాలని ఓడిపోయినా, నిజంగా తనే ఓడించాననీ, నాకు పేకాడటం రాదనీ, కనుక క్లబ్బుల జోలికి వెళ్ళననీ గాఢంగా విశ్వసించింది.

చివరికెలా తయారయిందంటే, -


గుమ్మం అవతలున్న మూర్రోజులు కూడా నన్నివతల కూచోమని నాలుగాటలాడితే పొద్దు పోతుందనేది.

కొత్త దంపతులు మాత్రం ఎన్నాళ్ళని సరసాల్లో మునిగితేలుతూ, ఉక్కబెట్టే గదుల్లో తలుపురెక్కలు బిగించుక్కూచుంటారు. మరదలు పిల్లనో, బామ్మర్దినో మాటల్లో పెట్టి రంగంలోకి దింపి పేకాట నేర్పితే - ఆ వంకతో మొగుడూ పెళ్ళాలు పబ్లిగ్గా మాటాడేసుకోవచ్చు. ఎవరు చూసినా సిగ్గుపడకుండా!

మీ పిన్ని పురాణకాలక్షేపం నుంచి వచ్చేప్పటికి మరోగంట పట్టేట్టుంది. ఈలోగా నాలుగాటలు వేద్దావేవిటి - పొద్దుట్నించీ చెయ్యి ఒహటే జిలజిల్లాడిపోతోంది.

●●●



## 13

**నాకు కాలు నిలకడ లేదని నీకు తెలుసు.**

అలాగంటే తిరిగే కాలు తిట్టే నోరు ఊరుకోవని నువ్వంటావని నాకు తెలుసు.

కానీ నాది తిరిగే కాలేగానీ తిట్టే నోరు కాదని - నాకేకాదు - నీకూ - మన బంధువర్గంలో అందరికీ తెలుసు.

నోటి తీట లేని కాబట్టి వాణ్ణనే గదోయ్ - అందరూ నన్నభిమానిస్తోంది. కొందరు నాతో మాట్లాడ్డం మానేస్తోందని - వాళ్ళకదో సరదా - పోనీ దురద అను నాకభ్యంతరం లేదు.

వాగించి - ఏదో ఇంటి రహస్యమో - ఎవరింటి గొడవో - బైటకిలాగి - ఫలానావాడు అన్నాడీమాట - అనటం, అందరితో అనిపించటం - వాళ్ళ అలవాటన్నమాట.

నాకలా మాటాడే అలవాటులేదని తెలిసినవాళ్ళు - నేనే అసలు తెలియని వాళ్ళలాగా దూరాభారంగా జరిగిపోతారు.

'థింగ్స్ హాపెన్ దెమ్ లైక్ దట్' అనగా శ్రీశ్రీగారన్నట్లు వాళ్ళనలా 'జరగనీ' - అదీ మంచిదే!

కాని కాలుమాత్రం ఒకచోట నిలవక పోవడం నిజం - అది కాదన్ను అంచాత అటు శ్రీకాకుళం నుంచి ఇటు కర్నూలుదాకా అలా తిరుగుతుంటేనే ఒక తృప్తి.

దానివల్ల నష్టాలున్నాయంటావా -

ఉంటే - ఎవరికి?

నా పెళ్ళాం పిల్లలకి -

నీకూ దేశానికీ కాదు కదా!

కాబట్టి, -

నా చాంద్రాయణంలో నేను విన్నవి, కన్నవి విన్నవించగా మాటలకై వెదుకాడగబోతే - మళ్ళీ శ్రీశ్రీ గారే అన్నట్లు వెదకక్కర్లేకుండా పోతుంది.

ఉదాహరణకి 'విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు' అని నినాదాలిచ్చి ఏదో సాధించామనుకుంటున్నామే, అక్కణ్ణించి మంగళగిరి టైర్ల ఫ్యాక్టరీదాకా - బోల్డ్ మాటలు చెప్పచ్చు.

అలా లేచ్చక్కాపోకు. అవన్నీ చెప్పనులే -

మాటవరసకన్నాను.

వరసంటే గుర్తొచ్చింది -

మీ గోత్రం భరద్వాజస కదూ - భరద్వాజస అంటే భగ్గూ వెలుగూ అంటారు. నువ్వలాంటివాడివి కాదని నాకు తెలుసనుకో -

నీది గోదారంత చల్లటి మనసు.

కృష్ణమ్మంత మెత్తటి గుండె

పెన్నలాంటి వెన్నపూస.

నన్నపార్థం చేసుకోవని తెలుసులేవోయ్ పార్థసారథీ!

విషయం ఇది - మీ గోత్రం మా గోత్రం ఒకటి కాదు గనక మా తమ్ముది ఆఖరి చెల్లెలు..

అదేవిటలాగ - మీ తమ్ముడి ఆఖరి చెల్లెల్లా మొహం పెట్టావే - కొసాకి విను -

మా తమ్ముడి ఆఖరి చెల్లెల్ని నువే చేసుకుంటే బావుంటుందని.. అనుకున్నాను.

అయినా - నేననుకున్నంత మాత్రాన సూత్రాలు ముడిపడతాయా?

మీ ఇద్దరికీ నచ్చాలి -

పెద్దవాళ్ళొప్పుకోవాలి -

అన్నిటినీ మించి దైవఘటనంటారే. అదుండాలి.

ఇన్నీ సమకూడితే -

కట్నకానుకల్దేవుందిలే -

నువు కీ.శే. సంజయ్‌గాంధి దగ్గర కట్నం తీసుకోనని రక్తాక్షరాలతో సంతకం చేశావా?

చేసినంత మాత్రాన - లాంఛనాల్లో మావాళ్ళు కక్కుర్తి పడతారనుకోకు. వాళ్ళ ముచ్చట్లు వాళ్ళవి కదా -

నేను ఆ పిల్ల సమ్మంధాల కోసమే కాలికి బలపం కట్టుకుని కాకిలా తిరుగుతున్నాననుకునేవ్.

చెప్పానుగా -

చిన్నప్పణ్ణించీ - నా కదో సరదా.

ద్విచక్రేలోకసంచారే అంటారు చూడు - అదన్నమాట - ఒదిలేయ్!

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలోనో,

మంగళగిరి టైర్ల ఫాక్టరీలోనో

మన వాళ్ళెవరికైనా ఉద్యోగాలు కావలిస్తే నాతో చెప్పు - నిమిషాల మీద పని.

అవనేకాదు - మరెక్కడైనా సరే -

అంత మొహమాటమెతే ఎలాగోయ్!

అవసరమైన పని అవసరమైన వాళ్ళతో అవసరం ఉన్నప్పుడు చేయించుకోవాలి. ఉద్యోగాలు వేయించుకోవాలి. మా తమ్ముడి ఆఖరి చెల్లెలి సంగతంటావా -

ఎలా రాసిపెట్టుంటే అలా జరుగుతుంది. నువ్వు వర్రీకాకు. నేను ఇజినారం వెళ్ళొచ్చాక మళ్ళీ కలుద్దాం.

*(సమాప్తం)*